







తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ,
హైదరాబాదు

సహ పాఠ్యాంశాలు



# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## 2వ తరగతి





రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## వాచకం, ఉపాధ్యాయ కరదీపిక

## 2వ తరగతి

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

తెలంగాణ, హైదరాబాదు.

# ముందుమాట

మానవులు సంఘజీవులు. తమ మనుగడకోసం అవసరమైన సమాజాన్ని నిర్మించుకొన్నారు. ఈ వ్యవస్థ నిర్వహణకు, కలిసికట్టుగా మనుగడ సాధించడానికి, అభివృద్ధి పొందడానికి సరైన అవగాహన, విశ్వసనీయతలు అవసరం. దీనికి సమిష్టితత్త్వం, పరస్పరాధారిత భావాలు కూడా అవసరం. కాబట్టి మానవ సమాజాలకు జనమెరిగిన ఆమోదయోగ్యమైన ప్రవర్తనా నియమావళి అవసరం. మనం కోరుకొన్న విధంగా మనం ప్రవర్తించలేం. ప్రతి సమాజానికీ దానికి అనుగుణమైన నైతిక నియమావళి ఉంటుంది. ఈ నైతిక నియమాల బహుళత్వానికి కూడా అంతర్లీనంగా కొన్ని ఆమోదిత ఉమ్మడి నియమాలు ఉంటాయి.

నీతిసూత్రాలు మన నడవడికి మార్గదర్శకంగా ఉండే నియమాలు. కాబట్టి పిల్లలుకూడా వాటిని ఆకళింపుచేసుకోవాలి. నైతికాభివృద్ధి అంటే కొన్ని నిబంధనలను అనుసరించడమో లేక ఎవరో ఏర్పరిచిన ఆదర్శ నమూనాల ప్రకారం నడుచుకోవడం మాత్రమేకాదు. నైతికాభివృద్ధి అంటే ప్రతి సందర్భంలోనూ సరైన కారణాన్ని తెల్పుకోగలగడం, విచక్షణతో నిర్ణయాన్ని తీసుకొని దాని ప్రకారం నడుచుకోగల సామర్థ్యం కలిగి ఉండడం. నైతిక చైతన్య అభివృద్ధిలో తాను తీసుకోబోయే నిర్ణయంతో తాను స్థిరంగా ప్రశాంతంగా ఉండగలిగే సామర్థ్యంకూడా ఉంటుంది. “అది నాకలాగే చెప్పారు. కాబట్టి నేను చేస్తున్నాను” అనే భావనకు ఇది విరుద్ధం. అందుచేత ఒక వ్యక్తి తనకు తాను శాంతి సౌఖ్యాలతో, ప్రశాంతంగా, స్థిరంగా ఉండడమే నైతికాభివృద్ధి సారాంశం. ఇందుకవసరమైన నైపుణ్యాలు కలిగి ఉండడమే జీవననైపుణ్యాలు. వీటిలో సమస్యను పరిష్కరించుకోవడం కలిసి పనిచేయడం, భావప్రసారంచేయడం, నాయకత్వం వహించడం, ఇతరులతో పరస్పర సంబంధాలను కల్గి ఉండడం వంటివి ముఖ్యమైనవి.

దురదృష్టవశాత్తు నేడు సమాజంలో నైతిక విలువలు పతనమౌతున్నాయని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. మనలో స్వార్థం పెరగడం, దురాశ పెరగడం, అవినీతికి అలవాటుపడడం, నైతిక నియమావళిని ఉల్లంఘించడం, లోభత్వం పెరగడం, నేను నాది వంటి అవలక్షణాలవల్ల వ్యక్తులు తమ జీవితాన్ని సంక్లిష్టం చేసుకోవడంతోపాటు సమాజంలోని వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ప్రతి ఒక్కరిలో అశాంతి పెరిగింది. నైతిక విలువల పతనంతోపాటు, పెరిగిపోతున్న ఒత్తిడిని, కనుమరుగౌతున్న మానవతా విలువలు, మానవసంబంధాలను గమనించవచ్చు. ఇవన్నీ ఒకరోజులోనో, ఒక సంవత్సరంలోనో వచ్చినవి కావు. మన జీవితాలలో సంయమనం, సమతుల్యత, విచక్షణ లోపించడమే దీనికి కారణం. వాటి స్థానంలో దురాశ, వినిమయవాదం, దోపిడీలు చోటుచేసుకొంటున్నాయి. వాటి నికర ఫలితమే సమాజంలోని అభద్రతాభావం, అపనమ్మకం, విచ్ఛిన్నమైన కుటుంబవ్యవస్థ, విలువల పతనం, సమాజంలో అశాంతి వ్యాపించడం మొదలగునవి.

వీటిని అరికట్టడానికి విద్యను ఒక సాధనంగా భావించి మనం విలువల విద్య, జీవననైపుణ్యాలు అనే అంశాన్ని ఒక ప్రధాన సబ్జెక్టుగా పాఠశాల విద్యలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశపెట్టడం ద్వారా పిల్లలు పాఠశాల విద్య పూర్తయ్యేసరికి హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ పొందుతారు. ఉన్నతమైన విలువలు, వైఖరులు, త్యాగబుద్ధి కలిగి ఉండి సమాజంపట్ల, పర్యావరణంపట్ల, తోటివారిపట్ల సమన్యాయంతో ప్రతిస్పందించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను (Syllabys) రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణసంస్థ రూపొందించింది. పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించడం చేయగలగాలని రాష్ట్ర

విద్యాప్రణాళిక పరిధిపత్రం 2011లోని రాష్ట్ర దృక్పథం (State Vision)లో పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో 1 నుండి 10వ తరగతి వరకు విలువల విద్య, జీవన నైపుణ్యాల పాఠ్యప్రణాళిక రూపొందించారు. అనంతరం తరగతి వారీగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకోసం ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పెంపొందించాల్సిన 18 ప్రధాన విలువలను గుర్తించి ప్రతి తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. అవి, 1) స్వేచ్ఛ, 2) సంతృప్తిగా జీవించడం, 3) శీలనిర్మాణం, 4) జీవన నైపుణ్యాలు, 5) బాధ్యతవహించడం, 6) పొదుపుచేయడం, 7) ఆరోగ్యవిలువలు, 8) సంస్కృతి సంప్రదాయలపట్ల గౌరవం, 9) ఆరోగ్య విలువలు, 10) శాస్త్రీయదృక్పథం, 11) న్యాయం, 12) శాంతి, కలిసిమెలిసి జీవించడం, 12) శ్రమవిలువ, 14) సేవాభావం, 15) సమానత్వం, సోదరభావం, స్త్రీలపట్ల గౌరవం, 16) జాతీయ భావన – దేశభక్తి, 17) లౌకికతత్త్వం – మతసామరస్యం, 18) ప్రజాస్వామ్య విలువలపట్ల గౌరవం. వీటిలో ప్రాథమికస్థాయికి 12 ప్రధాన విలువలు, ఉన్నతస్థాయికి మొత్తం 18 విలువల ఆధారంగా ఒక్కొక్క విలువకు తరగతివారీగా ఉపవిలువలను నిర్ధారించి పాఠాలను పొందుపర్చారు.

విలువలు ప్రధానంగా బోధిస్తే వచ్చేవికావు. ఆచరిస్తే వచ్చేవి. కాబట్టి తరగతి వారీగా రూపొందించిన ఉపాధ్యాయ కరదీపికల్లో సన్నివేశాలు, సంఘటనల ఆధారంగా చర్చించడం, ఆచరించి అనుభవాలు చెప్పడం వంటి కృత్యాలతో కూడిన అభ్యాసాలు ఉన్నాయి. చర్చల ద్వారా వైఖరి నిర్మాణం జరగాలి. ఆచరణ ద్వారా ప్రవర్తనలో మార్పురావాలని ఆశించి పాఠాలను పొందుపరచారు. వీటిని నిర్వహించడం మన బాధ్యత. నిర్వహణ తీరుతెన్నులను గురించి “ఉపాధ్యాయులకు సూచనలు” కూడా చేర్చారు. అట్లే విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి.

ఎంత మంచి కరదీపికైనా ఉపాధ్యాయుడికి ధీటుగాదు. ఉపాధ్యాయుడు తాను ఆదర్శంగా ఉంటూ విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రణాళికాబద్ధంగా తరగతి వారీగా రూపొందించిన కరదీపికల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. మన రాజ్యాంగం పీఠికలో పేర్కొన్నవిధంగా ఉన్నతమైన విలువలు, వైఖరులుకల్గిన హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులుగా మనవంతు కృషిచేయాలి. ఈ కరదీపికలోని అంశాలు మీకు కొంతమేరకు దిశానిర్దేశం చేస్తాయి. వీటికే పరిమితం కాకుండా అదనపు అంశాలు కూడా సేకరించవచ్చు. వినియోగించవచ్చు. విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి మన ఈ చిన్న ప్రయత్నం గోరంతదైనా ఇది కొండంత వెలుగునిస్తుందనే విశ్వాసంతో ప్రయత్నిద్దాం. ఫలితాలు సాధిద్దాం!

**సంచాలకులు**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

**యత్కర్మకుర్వతోఽ స్యస్యాత్, పరితోషాఽం తరాత్మనః**
**తత్ ప్రయత్నేన కుర్వీత, విపరీతం తు వర్జయేత్ – మనుస్మృతి**

**ఏపని చేస్తే అంతరాత్మకు సంతృప్తి కలుగుతుందో, ఆపనులే చేయాలి. దానికి విపరీతమైన పనులు చేయకూడదు.**

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ టి.వి.ఎస్.రమేశ్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ శ్రీనివాసుల రఘురాం,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., గ్రంథసిరి, గుంటూరు జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** ఉపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సి.పి.ఎల్, అంబర్‌పేట్, హైదరాబాదు.

**శ్రీ పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా.గిమ్మ, జైనత (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ బలగం రామ్మోహన్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., రవీంద్రపూర్, ముథోల్ (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్‌కుమార్,** తెలుగు పండితులు, జి.ప.ఉ.పా., ఇప్పటూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి యు. బుగ్గమ్మ,** తెలుగు పండితులు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి వంగీపురం స్వర్ణలత,** ఉపాధ్యాయిని, జి.ఉ.పా., పాతపట్టిసం, పోలవరం, పశ్చిమగోదావరి జిల్లా.

**శ్రీమతి అగుదూరి సరళమ్మ,** ఉపాధ్యాయిని, ప్రా.పా., చెర్లోపల్లి, చిత్తూరు జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగు పండితులు, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లిహిల్స్, హైదరాబాదు.

**శ్రీమతి జి. సరళాదేవి,** ఉపాధ్యాయిని, ప్రా.పా, గంగాపూర్, మహబూబ్‌నగర్

## సహకరించినవారు

**డా|| రమాదేవి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ వొజ్ఝల శరత్‌బాబు,** తెలుగు పండితులు, సీతాఫల్‌మండి, హైదరాబాదు.

**డా|| దోనేపూడి నరేశ్ బాబు,** తెలుగు పండితులు, జి.ఉ.పా., గోస్పాడు, కర్నూల్ జిల్లా.

**శ్రీ దోరవేటి చెన్నయ్య,** సూల్ అసిస్టెంట్, జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.

**శ్రీ రామక విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, కరీంనగర్ జిల్లా.

**డా|| గుడిసేవ విష్ణుప్రసాద్,** స్కూల్ అసిస్టెంట్, కృష్ణా జిల్లా.

**శ్రీ కలమట సోమేశ్వరరావు,** ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం జిల్లా.

**శ్రీ దివ్వెల చిన్నారావు,** తెలుగుపండితులు, విజయనగరం జిల్లా.

**శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, విజయనగరం జిల్లా.

**ముఖచిత్రం – డిజైనింగ్**

**కె.సుధాకరాచారి,**
SGT, UPS,
నీలకుర్తి, వరంగల్

## విషయనిపుణులు, ఎడిటింగ్

**డా||ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక విభాగాధిపతి,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,**
పూర్వ సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

**శ్రీ ఎస్.జగన్నాథరెడ్డి,**
సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

# కృతజ్ఞతలు

**"విలువల విద్య - జీవననైపుణ్యాలు"** కరదీపిక / వాచకాలను రూపొందించడంలో తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేసి అవసరమైన సామగ్రిని ఇచ్చి ప్రోత్సహించిన పెద్దలకు, ఆయా సంస్థలకు రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ సంస్థ, పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు.

**సలహాలు, సూచనలిచ్చినవారు :**

**శ్రీ శితికంఠానంద,** రామకృష్ణమఠం, హైదరాబాద్.
**శ్రీ కె.ఆర్.వేణుగోపాల్,** విశ్రాంత ఐ.ఎ.ఎస్., అధికారి, హైదరాబాదు.
**శ్రీ వాసగిరి లక్ష్మీనారాయణ,** ఐ.పి.ఎస్., కమీషనర్ ఆఫ్‌పోలీస్, థానే, మహారాష్ట్ర.
**డా॥ వి.బ్రహ్మారెడ్డి,** ప్రజావైద్యశాల, కర్నూలు జిల్లా.
**శ్రీ దూస రామకృష్ణ,** ఉపాధ్యక్షులు, విద్యాభారతి, అఖిలభారతీయ శిక్షాసంస్థాన్, న్యూఢిల్లీ మరియు సంచాలకులు, విజ్ఞానవిహార్, గడిలోవ, విశాఖపట్టణం.
**శ్రీ రావుల సూర్యనారాయణ,** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల శైక్షణిక ప్రముఖ, సరస్వతి విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
**శ్రీ ఫాదర్ పల్లిదానం,** సంచాలకులు, పీపుల్స్ ఆక్షన్ ఫర్ రూరల్ అవేకనింగ్ (PARA), రావులపాలెం, తూ.గో.జిల్లా.
**శ్రీ సుదర్శనాచార్య,** జాతీయ సంధానకర్త, లీడ్ ఇండియా సంస్థ, హైదరాబాదు.
**శ్రీమతి పోరూరి కృష్ణకుమారి,** ప్రజ్ఞ, కో-ఆర్డినేటర్, వికాస తరంగిణి, జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాదు.
**శ్రీ ప్రేమ్‌కుమార్‌సింగ్,** రామకృష్ణమఠం, హైదరాబాద్.
**డా॥ పి.జయధీర్ రెడ్డి,** విశ్రాంతప్రధానాచార్యులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.
**శ్రీ రవీందర్,** కో-ఆర్డినేటర్, వందేమాతరం సంస్థ, వరంగల్ జిల్లా.
**శ్రీ కె.మాధవరెడ్డి,** వందేమాతరం సంస్థ, మహబూబ్‌నగర్ జిల్లా.

**సహకరించిన సంస్థలు :**

- జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాదు.
- రామకృష్ణమఠం, హైదరాబాదు.
- శ్రీ సరస్వతీ విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
- సత్యసాయి విద్యాసంస్థలు, హైదరాబాదు.
- బ్రహ్మాకుమారీ సంస్థ, హైదరాబాదు.
- వందేమాతరం సంస్థ, వరంగల్, మహబూబ్‌నగర్.
- ఈనాడు, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దినపత్రికలు.
- ఎమెస్కో పబ్లిషింగ్ సంస్థ, హైదరాబాదు.
- జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్.సి.ఇ.ఆర్.టి.), న్యూఢిల్లీ.
- శ్రీ సీతారామ సేవాసదన్, మంథని, కరీంనగర్ జిల్లా.

పైన తెల్పిన వ్యక్తులు, సంస్థలతోపాటు పరోక్షంగా కూడా సహకరించిన వ్యక్తులకు, సంస్థలకు, వాచకాలు / కరదీపికల రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, విషయనిపుణులు, ఎడిటింగ్ చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. **విలువల విద్య - జీవన నైపుణ్యాల** గురించి వాచకం కరదీపికను రూపొందించడంలో ఇది ఒక తొలి అడుగుమాత్రమే! దీన్ని మరింత వృద్ధిపరచుకోవచ్చు. ఇందుకోసం భవిష్యత్తులో కూడా అందరూ సహాయ సహకారాలను ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నాం.

**సంచాలకులు**
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

# ఉపాధ్యాయులకు సూచనలు

- "విలువల విద్య - జీవన నైపుణ్యాలు" కోసం 1 నుండి 10 తరగతులకు తరగతివారీగా కరదీపికలు రూపొందించారు. వీటిని పిల్లలను ఉద్దేశించి తయారుచేశారు. అనగా వీటిని ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు, పిల్లలు స్వయం అభ్యసనానికి వినియోగించవచ్చు.
- ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ సబ్జక్టువారీగా కేటాయించిన పీరియళ్ళ భారత్వం ప్రకారం తరగతి వారీగా పాఠాలు పొందుపర్చారు.
- 1 నుండి 5 తరగతులకు వారానికి 42 పీరియళ్ళు ఉంటాయి. వీటిలో ఒక్కొక్క సబ్జక్టుకు కింది విధంగా భారత్వం ఉంటుంది.

| | | |
|---|---|---|
| మాతృభాష (తెలుగు / ఉర్దూ) | - | 12 పీరియళ్ళు |
| గణితం | - | 12 పీరియళ్ళు |
| ఆంగ్లం | - | 6 పీరియళ్ళు |
| పరిసరాల విజ్ఞానం | - | 6 పీరియళ్ళు |
| విలువలవిద్య, జీవననైపుణ్యాలు | - | 1 పీరియడ్ |
| శారీరక, ఆరోగ్యవిద్య | - | 2 పీరియళ్ళు |
| కళలు, సాంస్కృతికవిద్య | - | 2 పీరియళ్ళు |
| పని, కంప్యూటర్ విద్య | - | 1 పీరియడ్ |
| **మొత్తం** | **-** | **42 పీరియళ్ళు** |

- విలువల విద్య, జీవన నైపుణ్యాల గురించి బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు ప్రాథమికస్థాయిలో వారానికి 1 పీరియడ్, ఉన్నతస్థాయిలో వారానికి 2 పీరియళ్ళు ఉన్నందున, ఇందుకనుగుణంగానే పాఠాలను పొందుపర్చారు.
- ప్రాథమిక స్థాయిలో 12 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్కదానికి ఒకటి చొప్పున 12 పాఠాలు ఉన్నాయి. అట్లే ఉన్నత స్థాయిలో 18 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్క దానికి ఒక పాఠం చొప్పున 18 పాఠాలు ఉన్నాయి.
- వీటితోపాటు విలువలను పెంపొందించడానికి తోడ్పడేలా పద్యాలు, కథలు, గేయాలు, పాటలు అదనంగా చేర్చారు. 3వ తరగతి నుండి స్ఫూర్తిదాతలను కూడా చేర్చారు.
- విలువల విద్య - జీవన నైపుణ్యాలను పాఠాలలో సగటున ఒక పాఠానికి 3 పీరియళ్ళు అవసరమౌతాయి.

- ఒక పాఠంలోని విషయం అమరిక కింది విధంగా ఉంటుంది.

  •) పాఠం పేరు, •) ప్రధానవిలువ, •) ఉపవిలువ, •) ఆశించేఫలితాలు / లక్ష్యాలు, •) ఉపోద్ఘాతం, •) విషయం – సన్నివేశాలు / సంఘటనలు / కథనాలు, •) అభ్యాసాలు – 'ఆలోచించడం – ప్రతిస్పందించడం', 'తరగతి కృత్యం – జట్టుపని', 'ఆచరించడం – అనుభవాలు చెప్పడం', •) సూక్తి.

- విలువల విద్య, జీవన నైపుణ్యాలలోని అంశాలు ప్రధానంగా చర్చింపజేయడానికి ఉద్దేశించినవి. ఆచరించి అనుభవాలు చెప్పించడానికి ప్రాధాన్యతనిచ్చారు. కాబట్టి వీలైనంతమేరకు వీటిని రాయించకూడదు.

- **ఆలోచించడం – ప్రతిస్పందించడం**లోని ప్రశ్నల ద్వారా తరగతిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత **'తరగతి కృత్యం – జట్టుపని'** నిర్వహించాలి. అట్లే **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'**లోని అంశాలను ఆచరింపజేసేలా చేసి పిల్లలతో వారి అనుభవాలు, అనుభూతులను చెప్పించాలి.

- మిగతా సబ్జక్టులవలెనే **విలువల విద్య – జీవన నైపుణ్యాల**ను కూడా మూల్యాంకనం చేయాలి. వీటిని సంగ్రహాత్మక మూల్యాంకనం సందర్భంగా చేయాలి. అనగా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు నిర్వహించకూడదు. పిల్లల్ని పరిశీలించడం, వారి అనుభవాలు, ఆచరణ, ప్రవర్తన, విలువలు మొదలగు వాటి ఆధారంగా మూల్యాంకనం చేయాలి.

- దీని మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహించాలి. **విలువల విద్య – జీవన నైపుణ్యాలు** ఆధారంగా పిల్లల్లో విద్యాప్రమాణాలు సాధించాలి. అవి 1) మంచి, చెడు విచక్షణ జ్ఞానాన్ని ప్రదర్శించడం, సత్ప్రవర్తనకల్గి ఉండడం, 2) రాజ్యాంగ విలువలు పాటించడం, 3) వ్యక్తిగత విలువలు అనగా సహనం, దయ, సానుభూతి, తదానుభూతి మొదలగునవి కల్గి ఉండడం, 4) జీవన నైపుణ్యాలు కల్గి ఉండడం, 5) ఉపాధ్యాయులు, పెద్దలు, సమాజం, ప్రభుత్వ ఆస్తులపట్ల సరైన వైఖరులు కల్గి ఉండడం.

- పైన తెల్పిన విద్యాప్రమాణాలను ఆయా పాఠాల ఆధారంగా పరిశీలించాలి. వీటిని సాధించడానికి అనుగుణంగానే ప్రధాన విలువకు సంబంధించిన పాఠాలు తరగతుల వారీగా ఉన్నాయి. ఒక్కొక్క సామర్థ్యానికి 10 మార్కుల చొప్పున 50 మార్కులకు నిర్వహించాలి. అనగా పరిశీలించి మార్కులు కేటాయించాలి.

- పిల్లల ప్రగతిని పరిశీలించి గ్రేడింగ్ నమోదుచేయాలి.

  A1 – 91%

  A2 – 71% – 90%

  B1 – 51% – 70%

  B2 – 41% – 50%

  C – 0 – 40%

- పిల్లల ప్రగతిని గురించి గ్రేడింగ్ నమోదు చేసినప్పుడు వాటికి సంబంధించిన గుణాత్మక రిమార్కులు కూడా నమోదుచేయాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ విధానం – ప్రాథమిక స్థాయి

**మొదటి పీరియడ్ :**

- ఉపోద్ఘాతం గురించి తెలియజేయాలి.
- పాఠానికి సంబంధించిన విషయంలోని సన్నివేశాలు / సంఘటనలు / కథనాలను ఒకరితో చదివించాలి. లేదా చెప్పాలి.
- 'ఆలోచించండి – ప్రతిస్పందించండి' లోని ప్రశ్నల ఆధారంగా తరగతిలో చర్చ నిర్వహించాలి.

**రెండవ పీరియడ్ :**

- **'తెలుసుకోండి'**లోని విషయాన్ని గురించి పిల్లలకు చెప్పాలి లేదా ఒకరితో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- **'తరగతి కృత్యం – జట్టుపని'**ని తరగతిలో పిల్లలను జట్లుగా విభజించి నిర్వహించాలి.
- ఒక్కొక్క జట్టువారు చేసిన పనులను ప్రదర్శించాలి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** లోని అంశాలను ఇంటివద్ద ఆచరించమని చెప్పాలి.

**మూడవ పీరియడ్ :**

- పుస్తకం చివర ఉన్న 'అనుబంధం'లో చేర్చిన కథ / పాట / పద్యం / శ్లోకం / స్ఫూర్తిదాతల గురించి తరగతిలో పిల్లలతో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- ఆ తరవాత **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** గురించి ఒక్కొక్కరితో మాట్లాడించాలి.
- పాఠం చివర ఉన్న సూక్తి గురించి తెలియజేయాలి.

- పాఠశాలలో **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకాలను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు. గ్రంథాలయ పీరియడ్ సమయంలో లేదా భోజన విరామ సమయంలో కూడా పిల్లలకిచ్చి చదువుకోమని చెప్పాలి.
- 'విలువల విద్య – జీవన నైపుణ్యాలు' లోని సన్నివేశాలు, సంఘటనలు, సూక్తులు, పద్యాలు, శ్లోకాలు, కథలు, స్ఫూర్తిదాతల వంటి ఇతర అంశాలు కూడా సేకరించి తెలియజేయవచ్చు. వాటి ఆధారంగా కూడా చర్చ నిర్వహించడం, జట్టుపనులు చేయించడం, 'ఆచరించండి – అనుభవాలు చెప్పండి' వంటివి నిర్వహించవచ్చు.
- పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికలు వంటి వాటిని వినియోగించాలి.
- విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి. వీటిని మొదటి పీరియడ్‌లోనే చదివి వినిపించాలి. వీటి గురించి అర్థం చేయించాలి. ఆ ప్రకారం పిల్లలు నడుచుకొనేలా చూడాలి.

# విషయసూచిక


| వ.సం. | ప్రధాన విలువ | నేర్వవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 1. | స్వేచ్ఛ | మన చుట్టూ ఉన్న జీవులు స్వేచ్ఛ కలిగి ఉంటాయని గుర్తించడం | పంజరంలోని చిలుక | 1 |
| 2. | సంతృప్తిగా జీవించడం | అత్యాశ లేకుండా సంతృప్తిగా జీవించడం | అత్యాశ | 4 |
| 3. | శీల నిర్మాణం | స్నేహం విలువ గుర్తించడం | స్నేహం | 7 |
| 4. | జీవన నైపుణ్యాలు | పంచుకోవడంలో ఆనందాన్ని గుర్తించడం | పంచుకుందాం | 10 |
| 5. | బాధ్యతవహించడం | తమ వస్తువులను జాగ్రత్తగా కాపాడుకోవడం | దొరికిన పెన్ను | 14 |
| 6. | పొదుపు చేయడం | వస్తువులను పొదుపుగా వాడుకోవడం | పొదుపు | 18 |
| 7. | ఆరోగ్య విలువలు | దంతాల పరిశుభ్రత గురించి తెలుసుకోవడం | దంతాల పరిశుభ్రత | 20 |
| 8. | సంస్కృతి, సంప్రదాయాలపట్ల గౌరవం | వివిధ వేషధారణల గురించి తెలుసుకోవడం | వేషధారణ | 23 |
| 9. | పర్యావరణ పరిరక్షణకు తోడ్పడం | చెట్ల ఉపయోగాలను తెలుసుకోవడం, తగిన విధంగా ప్రవర్తించడం | చెట్లు మన నేస్తాలు | 26 |
| 10. | శాస్త్రీయ దృక్పథం | క్రమపద్ధతిలో ఆలోచించడం యొక్క ఆవశ్యకతను తెలుసుకోవడం | పద్ధతిగా చేద్దాం | 30 |
| 11. | న్యాయం | అందరికీ ఒకే న్యాయమని గుర్తించడం | ఎవరైనా ఒక్కటే | 33 |
| 12. | శాంతి / కలిసి మెలిసి జీవించడం | జీవులపై దయకల్గి యుండడం | భూతదయ | 36 |


## అనుబంధం


1. శ్లోకాలు 40
2. పద్యాలు 41
3. పాటలు, గేయాలు 44
4. కథలు 51

# విద్యార్థులకు సూచనలు

- పిల్లలూ! **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకం మీకోసమే రూపొందించి పాఠశాలలకు పంపారు.
- వీటిలోని పాఠాలు, పద్యాలు, కథలు, శ్లోకాలు, పాటలు, స్ఫూర్తిదాతల గురించి మీకు మీ ఉపాధ్యాయులు బోధిస్తారు. లేదా మీరే చదవండి. ఇతరులకు చెప్పండి, వాటి గురించి చర్చించండి.
- వీటి గురించి మీకు వారానికి ఒకరోజు బోధిస్తారు.
- ఒక పాఠంలోని సన్నివేశాలు, సంఘటనలు గురించి మీలో ఒకరు చదివిన తర్వాత మీ ఉపాధ్యాయుడు, కొన్ని ప్రశ్నలు అడుగుతారు. వీరందరూ ఆ ప్రశ్నలకు ఆలోచించి జవాబులు చెప్పండి. చర్చలో పాల్గొనండి.
- తరగతిలో జట్టు కృత్యాలు నిర్వహిస్తారు. మీరు మీ మిత్రులతోకలిసి జట్టు పనుల్లో పాల్గొనండి. మీరు జట్లలో చర్చించిన విషయాల గురించి తరగతిలో చెప్పండి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** అని కొన్ని పనులను మీకు పురమాయిస్తారు. ఆ ప్రకారం మీరు ఆచరించండి. ఆ తరవాత వచ్చే పీరియడ్‌లో ఏం చేశారు? మీకెలా అనిపించిది? దీన్నుండి మీరేమి నేర్చుకొన్నారు? మొదలగు విషయాలను, మీ అనుభవాలను తెలియజేయండి.
- వీటిలోని అంశాలు ఎక్కువగా చర్చించడానికి, ఆచరించి అనుభవాలు చెప్పడానికి ఉద్దేశించినవి కాబట్టి రాయాలని భావించకండి. తప్పనిసరిగా చేయండి.
- మీరు తెల్సుకొన్న, చర్చించిన అంశాల ఆధారంగా వార్తాపత్రికలలో చూడండి. వాటి నుండి సేకరించిన విషయాలు, వార్తలు, వ్యాసాలు, సూక్తులు మొదలగువాటిని తరగతిలో చదివి విన్పించండి. ఆ తరవాత వాటిని తరగతిలోని గోడపత్రికలో ప్రదర్శించండి.
- వీటికి కూడా మూల్యాంకనం ఉంటుంది. ఐతే, వీటికి పరీక్షలు ఉండవు. మీరెలా పాల్గొంటున్నారు? మీ ప్రవర్తన ఎలా ఉంది? మీలో ఏం మార్పువచ్చింది? మొదలగు విషయాలను మీ ఉపాధ్యాయులు పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా మీకు గ్రేడింగ్ ఇస్తారు.
- ఇలా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మీ గురించి నమోదుచేస్తారు. మొదటి సంగ్రహణాత్మక, రెండవ సంగ్రహణాత్మక, మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనాలతోపాటు మిమ్మల్ని పరిశీలించి మీ ప్రగతిని గ్రేడుల రూపంలో నమోదుచేస్తారు.
- 10వ తరగతి మెమో / సర్టిఫికెటులో కూడా ఈ వివరాలు ఉంటాయి.
- వంట ఎంత మంచిగా వండినా, దాంట్లో చిటికెడు ఉప్పు లేకుంటే రుచి ఉండదదని భాస్కరశతకంలోని పద్యం ఉంది. అట్లే మనం ఎంత చదువుకున్నా, ఎంత మంచి గ్రేడు వచ్చినా, మనలో 'వినయం, సహనం, శీలం, విచక్షణ' లేకుంటే మనకు విలువ ఉండదు. కాబట్టి విలువల విద్య – జీవన నైపుణ్యాలు పాఠాల ద్వారా మీరు గొప్పవారుగా ఎదగాలి.

# 1 పంజరంలోని చిలుక

## I. ప్రధాన విలువ

స్వేచ్ఛ

## II. ఉప విలువ

మన చుట్టూ ఉన్న జీవులకు స్వేచ్ఛ ఉందని గుర్తించడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- పరిసరాల్లోని పక్షులు, కీటకాలు మొదలగువాటిని బంధించకూడదని తెలుసుకోవడం.
- తమ పరిసరాలలో ఉండే పక్షులు, జంతువులు, ఇతర జీవులకు స్వేచ్ఛనివ్వాలి అనే విషయాన్ని తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

ప్రపంచంలో ప్రతి జీవి స్వేచ్ఛను కోరుకుంటుంది. మన చుట్టూ కనిపించే జంతువులు, పక్షులు మనకు ఎంతో సహాయంచేస్తున్నాయి. మన చుట్టూ ఉన్న అన్ని జీవులు తమకు ఇష్టం వచ్చినట్లుగా జీవించాలి. వాటిని బంధించకూడదు. వాటిపట్ల దయకలిగి ఉండాలి. జంతువులు, పక్షులు మనలాగా మాట్లాడలేకపోవచ్చు. కానీ వాటికూడా మనలాగ ప్రాణం ఉంది. బాధను అవికూడా అనుభవిస్తాయి. దీన్ని గమనించి మనం అన్ని జీవులకు స్వేచ్ఛ ఉందని గుర్తించాలి.

## V. విషయ వివరణ

***కింది కథను చెప్పండి. అవగాహన కల్పించండి.***

*పిల్లలంతా తోటలో ఆడుకుంటున్నారు. ఈశ్వర్‌కి ఒక చిలుక దొరికింది. ఈశ్వర్ దాన్ని పెంచుకోవాలనుకున్నాడు. ఇంటికి తీసుకొచ్చాడు. దాన్ని ఒక పంజరంలో పెట్టాడు. దీన్ని ఈశ్వర్ వాళ్ళ అమ్మ గమనించింది. "ఈశ్వర్! చిలుకను ఎందుకు తీసుకొచ్చావురా? దాన్ని అలా ఎందుకు పంజరంలో పెట్టావు?" దాన్ని వదిలేయరా! అని చెప్పింది. నాకు చిలుకలంటే ఇష్టం. నేను ఈ చిలుకను పెంచుకుంటాను. దీన్ని విడవిపెట్టను అని ఈశ్వర్ చెప్పాడు. చిలుకకు పంజరంలో పండ్లు, గింజలు పెట్టాడు. కానీ చిలుక వాటిని ముట్టుకోలేదు. అలాగే దిగులుగా కూర్చుని ఉంది. మరునాడు ఉదయం ఈశ్వర్ చిలుకకు పండ్లు, గింజలు తినిపించాలని చూశాడు. కానీ చిలుక అలాగే దిగులుగా కూర్చుని ఉంది. కాసేపటికి ఈశ్వర్ నిద్రపోయాడు. అమ్మ, నాన్నకు బజారులో పని ఉందని నిద్రపోతున్న ఈశ్వర్‌ని ఇంట్లో ఉంచి తాళం వేసుకుని వెళ్ళారు. కాసేపటికి ఈశ్వర్‌కి మెలకువ వచ్చింది. లేచి బయటికి వెళ్ళాలనుకుని చూశాడు. బయటి తాళం వేసుంది. ఈశ్వర్‌కి ఏడుపొచ్చింది. ఆకలిగా ఉంది. గదిలో అటు ఇటు తిరిగాడు. దిగులుగా కూర్చుని ఉన్నాడు. ఇంతలో బజారు నుండి అమ్మా నాన్నా వచ్చారు. వాళ్ళను చూడగానే ఈశ్వర్‌కి ఒక్కసారి ఏడుపు వచ్చింది. నన్ను ఒంటరిగా వదిలి మీరెక్కడికి వెళ్ళారు? నాకు భయం వేసింది. ఆకలిగా కూడ ఉంది అని చెప్పాడు. మన ఇల్లేగా ఎందుకు భయం? ఇంట్లో తినడానికి అన్నీ పెట్టి వెళ్ళాను. తినొచ్చుగదా! అంది అమ్మ. అన్నీ ఉన్నాకూడా మీరు లేకుంటే నాకు దిగులేసింది. తినబుద్ధికాలేదని చెప్పాడు. చూడు ఈశ్వర్! నిన్ను ఇలా గదిలో పెట్టి తాళం వేసుకొని వెళితే, నీకు బాధకలిగింది. అన్నీ ఉన్నా తినబుద్ధికాలేదు. నీకు నోరు ఉంది కాబట్టి నీ బాధను నాతో చెప్పావు. పాపం ఆ చిలుకను చూడు. నిన్నటి నుండి దాన్ని అలా పంజరంలో పెట్టావు. దానికి కూడా ఇలానే ఉంటుంది కదా! అని అమ్మ అంది. తప్పు తెలుసుకున్న ఈశ్వర్ వెంటనే పంజరం తలుపు తెరిచాడు. చిలుకమ్మ కూడా తుర్రుమని ఎగిరిపోయింది. అలా వెళుతున్న చిలుకను చూసి ఈశ్వర్ సంతోషంగా చప్పట్లు కొట్టాడు.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

**కింది ప్రశ్నలకు పిల్లలందరిచేత సమాధానాలు చెప్పించండి.**

1) కథ ద్వారా మీరేం తెలుసుకున్నారు? మీకేమనిపించింది?

2) ఈశ్వర్ చిలుకను పంజరంలో పెట్టాడు కదా! ఇలా చేయవచ్చా? చేయకూడదా? ఎందుకు?

3) పక్షులు, జంతువులకు కూడా బాధకల్గుతుందా? వాటికి మనం చేసే ఏ ఏ పనులవల్ల బాధకలుగుతుంది?

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

**కింది వాక్యాలను చదివి వినిపించండి. అవును / కాదు పిల్లలందరితో చెప్పించండి. వారి అభిప్రాయాలపై మాట్లాడించండి.**

1) నేనెప్పుడు పక్షులను బంధించను, బాధించను. అవును / కాదు

2) ఎవరైనా పక్షులను, జంతువులను హింసించినా అలాచేయడం తప్పు అని చెబుతాను. అవును / కాదు

3) అన్ని జీవులు స్వేచ్ఛను కోరుకుంటాయి. కాబట్టి దానికి నేను దాన్ని అడ్డుకోను. అవును / కాదు

4) పక్షులకు గింజలు, నీళ్ళు పెట్టాలి. అవును / కాదు

*(ఒక్కొక్కరితో అవును / కాదు చెప్పించిన తర్వాత పక్షులు, జంతువులను బాధపెట్టకూడదని, వాటిని స్వేచ్ఛగా ఉండేలా చూడాలని అవగాహన కల్పించాలి.*

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

మీ చుట్టుపక్కల పక్షులను, జంతువులను వాటి ఇష్టం వచ్చినట్లు బ్రతుకనీయకుండా ఎలా అడ్డుకుంటున్నారో గమనించి చెప్పండి.

**సూక్తి**

**ఈ భూమి అన్ని జీవరాశులకు సంబంధించినది. దీనిపై నివసించే అన్ని జీవరాశులకు స్వేచ్ఛగా బతికే హక్కు ఉంది.**

# 2 అత్యాశ

## I. ప్రధాన విలువ

సంతృప్తిగా జీవించడం

## II. ఉప విలువ

అత్యాశ లేకుండా సంతృప్తిగా జీవించడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- అత్యాశ లేనప్పుడే ఆనందం ఉంటుంది అని గ్రహింపజేయడం.
- దురాశ లేకుండా లభించిన దానితో తృప్తి చెందడంలోనే సంతోషం ఉంటుందని తెలియజేయడం.
- సంతృప్తిగా జీవించడం ఒక అలవాటుగా మారేలా విద్యార్థులకు ప్రేరణ కలిగించడం.

## IV. ఉపోద్ఘాతం

సాధారణంగా మనకు డబ్బు ఎంత ఎక్కువ ఉంటే, ఎంత ఖరీదైన వస్తువులను కలిగి ఉంటే అంత సంతోషంగా ఉంటామని భావిస్తాం. కానీ వస్తువులు సంపాదించినంత మాత్రాన సంతోషం లభించదు. సంతృప్తి మాత్రమే సంతోషాన్ని ఇస్తుంది. అత్యాశ, ఇతరులకు ఉన్న వస్తువుల్లాంటివి అన్నీ మనం పొందాలనే కోరిక దుఃఖానికి దారి తీస్తుంది. మనిషికి ఆశ ఉండడం తప్పు కాదు కానీ అత్యాశ, దురాశ ఉండడం అనేది మొదటికే మోసాన్ని కలుగజేస్తుంది.

## V. విషయ వివరణ

ఒక ఊరిలో సుబ్బయ్య, శివయ్య అనే అన్నదమ్ములు నివసించేవారు. వాళ్ళ తండ్రి చనిపోతూ ఆస్తితోపాటు బాతులను సమానంగా పంచి ఇచ్చాడు. వారిని ఉన్నదాంట్లో తృప్తిగా జీవించమని చెప్పిపోయాడు. సుబ్బయ్య, శివయ్యలు తమ భార్యలతో కలిసి వేర్వేరు ఇళ్ళలో నివసించసాగారు. వాళ్ళవంతుకు వచ్చిన బాతుల్లో ఒక్కొక్కరికి ఒక బంగారు గుడ్డు పెట్టే బాతు కూడా వచ్చింది. సుబ్బయ్య దంపతులు ఆ బాతు బంగారు గుడ్డు పెట్టడంతో ఎంతో ఆనందించారు. తాము అందరికన్నా ధనవంతులం కావచ్చని భావించారు. ఆ బాతు రోజూ ఒక గుడ్డు మాత్రమే పెట్టసాగింది. ఇలాగే శివయ్య దంపతులు కూడా తమ బాతు బంగారు గుడ్డు పెట్టడంతో సంతోషించారు. ఆ బాతు గుడ్లను భద్రపరచసాగారు.

సుబ్బయ్య దంపతులకు ఆశ మరింత పెరిగింది. 'ఈ బాతు ప్రతిరోజూ ఒక బంగారు గుడ్డు పెడుతోంది. దీని కడుపులో చాలా బంగారు గుడ్లు ఉండి ఉంటాయి. ప్రతిరోజూ ఒక్కో గుడ్డు కోసం వేచి చూడడం ఎందుకు? ఒకేసారి బాతును చంపి బాతు పొట్టలోని అన్ని గుడ్లు తీసుకొంటే పోలా! అనుకున్నారు. అనుకున్నదే తడవుగా వాళ్ళు ఒక కత్తి తెచ్చారు. ఆతురతతో బాతు పొట్ట చీల్చారు. పొట్టలో చూస్తే బంగారు గుడ్లు కాదు గదా! మామూలు గుడ్లు కూడా కనిపించలేదు. అత్యాశకు పోయినందుకు వారు చింతించారు. చివరికి బాతును చంపుకున్నందుకు వారు వెక్కి వెక్కి ఏడ్చారు.

శివయ్య దంపతులు మాత్రం ఒక్కో గుడ్డును జమచేసి ఇంకా ధనవంతులయ్యారు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) ఈ కథలో ఎవరు అత్యాశకు పోయారు?అత్యాశకు పోవడం వల్ల వారికి ఏమి జరిగింది?

2) శివయ్య దంపతులు అత్యాశకు పోకపోవటంవల్ల వారికి ఏం జరిగింది?

3) అత్యాశ వల్ల ఏం జరుగుతుంది?

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

**విద్యార్థులకు దురాశపై చిన్న గేయాన్ని వినిపించాలి. అభ్యాసం చేయించి, చర్చించాలి.**

కుక్కకు మాంసం దొరికింది
వంతెన మీదకు పోయింది
నీటిలో నీడను చూసింది
వేరొక కుక్కని తలచింది
ఆ కుక్క నోట ముక్కను కూడా
తానే కాజేయాలనుకుంది
భౌ భౌ మని అరిచింది
తనకున్నది సైతం పోయింది

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

మీ చుట్టుపక్కల వారిలో ఎవరికి అత్యాశ ఉందో గమనించి చెప్పండి.

**సూక్తి**

**అత్యాశ వల్ల దుఃఖం కలుగుతుంది**

# 3 స్నేహం

## I. ప్రధాన విలువ

శీల నిర్మాణం

## II. ఉప విలువ

స్నేహం విలువ గుర్తించడం.

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- స్నేహం యొక్క గొప్పతనాన్ని తెలుసుకోవడం.
- తోటివారితో స్నేహంగా మెలగడం నేర్చుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

స్నేహితులు లేని జీవితాన్ని ఊహించలేము. స్నేహం వల్ల కలిగే లాభాలు చాలా ఉన్నాయి. స్నేహానికి రంగు, రూపం, అందం అనేవి అడ్డుకాదు. స్నేహం విలువను గుర్తించి అందరితో స్నేహంగా ఉండాలి. స్నేహం వల్ల కలిగే మంచిని పొందగలగాలి. ఎక్కువ మంది స్నేహితులను సంపాదించుకోవాలి. అహంకారంతో తెలివి తక్కువతనంతో స్నేహం విలువను తక్కువ చేయరాదు. స్నేహితుల వల్ల కలిగే మేలును గురించిన కథను తెలుసుకుందాం.

## V. కథ

*ఒక కొలనులో తల్లి హంస తనపిల్ల హంసతో నివసించేది. గట్టున ఉన్న చెట్టుపైన కాకి ఉండేది. చెట్టుతొర్రలో తేలు కాపురం ఉండేది. ఈ మూడు మంచి స్నేహితులు.*

*తల్లి హంస, కాకి, తేలు రోజూ కలుసుకుని ఎన్నో విషయాలు మాట్లాడుకునేవి. ఒకరికష్టాలు మరొకరికి చెప్పుకునేవి, సహాయం చేసుకునేవి. చక్కగా ఉండేవి. ఇది పిల్లహంసకు ఏమాత్రం నచ్చేది కాదు.*

*అమ్మా! మనం చాలా అందంగా ఉంటాం. మనతో పోలికేలేని ఆ నల్లకాకితో, తేలుతో మనకు చెలిమివద్దు అనేది పిల్లహంస. "రూపం రంగు చూసి కాదమ్మా మంచి మనసు, గుణము చూసి స్నేహం చేయాలి". అని తల్లిహంస చెప్పింది.*

*ఇలా ఉండగా ఒకనాడు వేటగాడు కొలను దగ్గరికి వచ్చాడు ఒంటరిగా వున్న పిల్లహంసను పట్టుకుని, పంజరంలో పెట్టుకుని వెళుతున్నాడు. పిల్లహంస భయంతో గట్టిగా "రక్షించండి, రక్షించండి" అని అరిచింది. అది విన్న తేలు, కాకి పిల్లహంసను కాపాడుటకు ఒక ఉపాయాన్ని ఆలోచించాయి.*

*తేలు జరజరా పాకుకుంటూ వెళ్ళి వేటగాడి కాలుపై గట్టిగా కుట్టింది. దానితో వాడు పంజరాన్ని పడవేసి "అమ్మా" అంటు అరిచి బాధపడుతున్నాడు. ఇంతలో కాకి పంజరం దగ్గరికి చేరి తలుపుకు అడ్డంగాఉన్న పుల్లను గట్టిగా లాగింది. పిల్ల హంస బయటకు వచ్చి కొలనులోకి జారిపోయింది.*

*"చూశావా చిట్టీ! కాకి, తేలు, ఎంత మంచివారో, వారివల్లే నీవు బయటపడ్డావు!" అంది తల్లిహంస పిల్లహంసకు స్నేహం వల్ల కలిగే మంచి తెలిసివచ్చింది. అందరితో స్నేహంగా ఉండసాగింది.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) తల్లి హంసకు స్నేహితులు లేకుంటే ఏమయ్యేది?

2) మీరు మీ తరగతిలో ఎవరెవరితో స్నేహంగా ఉంటారు? ఎందుకు?

3) మీరు మీ స్నేహితులకు ఎప్పుడైనా సహాయం చేశారా?

4) స్నేహితులు లేకుంటే ఎలా ఉంటుంది?

2వ తరగతి

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

మీ స్నేహితుల పేర్లు చెప్పండి. వారిలో మీకు నచ్చిన విషయాలు చెప్పండి.

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

స్నేహం యొక్క గొప్పతనాన్ని తెలిపే కథలను / పాటలను తెలుసుకొని రండి. తరగతి గదిలో చెప్పండి.

### గేయం

1) మంచి మార్గం చూపేవారూ
కష్టాల్లో కాపాడే వారూ
ప్రేమతో నన్ను పిలిచేవారూ
నేస్తాలు! నా నేస్తాలు.

2) ఆటపాటలలో అలగనివారు
కమ్మని కబుర్లు చెప్పేవారు
కలకాలం కలిసుండేవారు
నేస్తాలు! నా నేస్తాలు.

3) కల్లాకపటం లేనివారు
కులమత భేదం కాననివారు
హెచ్చు తగ్గులు యెంచనివారు
నేస్తాలు! నా నేస్తాలు.

4) సమతా మమతలు పెంచేవారు
సౌజన్యాన్ని పంచేవారు
ఎల్లవేళలా కాచేవారు
నేస్తాలు! నా నేస్తాలు.

**సూక్తి**

**స్నేహం వల్ల సంతోషం పెరుగుతుంది. దుఃఖం తరుగుతుంది. మంచి స్నేహితులు లభించడం భగవంతుని వరం. ప్రతి ఒక్కరికి స్నేహితులు ఉండాలి.**

# 4 పంచుకుందాం

## I. ప్రధాన విలువ

జీవన నైపుణ్యాలు

## II. ఉప విలువ

పంచుకోవడంలో ఆనందాన్ని గుర్తించడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- పంచుకోవడంలోనే ఆనందం ఉంటుందని తెలుసుకుంటారు.
- ఇతరులకు సహాయంచేసే గుణాన్ని అలవరచుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

సమాజంలో మానవులందరూ కలిసి మెలిసి జీవిస్తుంటారు. తమ అవసరాలు తీర్చుకోవడానికి ఒకరిపై మరొకరు ఆధారపడుతుంటారు ఇతరులకు అవసరమైనవి మనం ఇవ్వడం జరుగుతుంది. మనకు అవసరమైనవి తీసుకోవడం జరుగుతుంది. ఇలా పంచుకోవడంవల్ల ఆనందంగా ఉంటాము అనే విషయం పిల్లలకు తెలియజేయడమే ఈ పాఠ్యాంశం యొక్క ఉద్దేశ్యం.

## V. విషయ వివరణ

*2వ తరగతిలో అనిల్, సునిల్ అనే ఇద్దరబ్బాయిలుంటారు. అనిల్ చాలా సహకార గుణాన్ని కలిగియుంటాడు. ఎవరికి ఏది కావాలన్నా తన దగ్గర ఉన్న వస్తువులు ఇచ్చేవాడు, తనకు కావాల్సినప్పుడు ఇతరుల నుండి అడిగి తీసుకునేవాడు. సునిల్ మాత్రం ఎవరికి తన వస్తువులను తాకనివ్వడు. ఎవరికి ఏ అవసరమొచ్చినా తన దగ్గర ఉన్న వస్తువులను మాత్రం ఇతరులకు ఇవ్వడు. ఒకరోజు యధావిధిగా తరగతి గదిలో టీచర్ బొమ్మలు గీయమని చెప్పింది. సునిల్ దగ్గర ఉన్న Colour Pencils Box కనిపించలేదు. పిల్లలందరు తమ తమ దగ్గరున్న వస్తువులను ఒకరికొకరు పంచుకుంటూ చక్కగా బొమ్మలు వేశారు. సునిల్ వాళ్ళను చూసి ఏడుస్తున్నాడు. అది గమనించిన టీచర్ ఎవరైనా సునిల్‌కి సహకరించమని చెప్పింది. అనిల్ మరియు మిగత విద్యార్థులు తమ దగ్గరున్న వస్తువులను సునిల్‌కి ఇచ్చి బొమ్మలు వేయడంలో సహకరించారు. సునిల్ చాలా ఆనందపడ్డాడు. అప్పుడు టీచర్ మన దగ్గరున్న వస్తువులను ఒకరికొకరు పంచుకోవడం వలన సమయానికి పనులు పూర్తి చేసుకొని ఆనందంగా ఉంటాము అని సునిల్‌తో చెప్పింది. అప్పటి నుండి సునిల్ తన తప్పును తాను తెలుసుకొని తన వస్తువులను ఇతరులకు పంచి ఇవ్వడం అలవాటు చేసుకున్నాడు.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) పిల్లలూ! పై కథ ద్వారా మీరు ఏమి తెలుసుకున్నారు?
2) సునిల్‌కి పంచుకోవడంలోనే ఆనందముంటుందని ఎలా తెలిసింది?
3) మీరు ఎవరికైనా ఎప్పుడైనా మీ వస్తువులను ఇచ్చారా?
4) ఒకరికొకరు ఎందుకు సహాయం చేసుకోవాలి?
5) పంచుకోవటం వల్ల మనకు కలిగే లాభాలేమిటి?

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

**మీరు కింది వాటిని పాటిస్తుంటే 'అవును' అని పాటించకపోతే 'కాదు' అని చెప్పండి**

| | అవును | కాదు |
|---|---|---|
| 1) నాకు మామిడి పండ్లంటే ఇష్టం. నాన్న ఒక పండే తెచ్చారు. కానీ చెల్లికి కూడా ఇస్తాను. | | |
| 2) నా స్నేహితుడు ఇంటిపని చేయడానికి ఇబ్బంది పడుతుంటే సహాయం చేస్తాను. | | |
| 3) భోజన సమయంలో నా ఆహారాన్ని ఉండే వాటిని స్నేహితులందరం పంచుకొని తింటాము. | | |
| 4) అవసరమైనప్పుడు ఒకరికొకరు సహాయం చేసుకుంటాము. | | |
| 5) నా మిత్రుడు పుస్తకం మరచిపోయివస్తే నా పుస్తకం చూపిస్తాను. | | |
| 6) ఇంటి పనుల్లో అమ్మకి సహాయం చేస్తాను. | | |
| 7) నాన్న చెప్పిన పని చేస్తాను. | | |
| 8) నాకిచ్చిన చాక్‌లెట్లను అక్క, చెల్లి, అన్న, తమ్ములకు ఇస్తాను. | | |

*(గమనిక : పై విషయాలను పిల్లలకు చదివి వినిపించండి. దీనికి ఎంత మంది 'అవును' అని చెప్పారో, ఎంతమంది 'కాదు' అని చెప్పారో నల్లబల్లపై రాయండి. వీటిపై ప్రశ్నలు వేస్తూ ఒకరికొకరు సహాయం చేసుకోవాలని తెలియజేయండి.)*

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

ఈ వారంలో మీరు ఎవరికి ఏ విధంగా సహాయం చేశారో చెప్పండి.

## కాకి - పిచ్చుక

రంగనాథపురంలో పెద్ద చెఱువు ఉంది. ఆ చెఱువు గట్టుపై మఱ్ఱిచెట్లు ఉన్నాయి. అందులో ఒక చెట్టుపై కాకి గూడుకట్టుకొని నివసిస్తుండేది. మరొకచెట్టుపై పిచ్చుక గూడు కట్టుకొని జీవించేవి. ఒకసారి ఆ ప్రాంతంలో పెద్ద తుఫాను వచ్చి గాలికి పిచ్చుక గూడు కాస్తా పడిపోయింది. పాపం పిచ్చుక పిల్లలన్నీ వణికిపోసాగాయి చలికి. తల్లి పిచ్చుక పిల్లలను కాపాడాలన్న తపనతో కాకమ్మ గూడుకి చేరి వర్షం తగ్గేవరకు ఆశ్రయం ఇమ్మని కోరింది. దానికి కాకి "అయ్యో! నా గూడు ఖాళీగా లేదే?" అంటూ పంపివేసింది. పిచ్చుక చేసేదిలేక వెళ్ళిపోయి ఎలాగో కాలం గడిపింది. తుఫాన్ తగ్గాక మళ్ళీ కొత్తగూడు నిర్మించుకుంది. ఈసారి హాయిగా జీవిస్తోంది.

మరొకసారి పెద్ద గాలితో, మెరుపులు, ఉరుములతో వర్షం వచ్చి కాకి గూడు కాస్తా పడిపోయింది. ఇప్పుడు కాకి దిక్కులేనిదై పిల్లలతో పాటు పిచ్చుకను చేరి ఆశ్రయం కోరింది. పిచ్చుక మంచి మనసుతో కాకికి, పిల్లలకు ఆశ్రయాన్ని అందించింది. తన గూటిలో గల ఆహారాన్ని కాకికి, పిల్లలకు ఇచ్చి ఆకలి తీర్చింది. దాంతో పిచ్చుక మంచి మనసును గుర్తించి కాకి పిచ్చుకను ఆనాడు ఆదరించలేకపోయానే! అంటూ సిగ్గుపడింది. తోటివారికి వచ్చిన కష్టానికి కలిగి మనం కూడా మంచి మనసుతో వారికి సహాయపడగలగాలి. అలా సహాయపడితే మనకి కూడా కష్టం వచ్చినప్పుడు వారు ఆదరిస్తారు అని గ్రహించగలగాలి.

### విద్యార్థి కృత్యములు

పండుగలను, పుట్టిన రోజులను స్నేహితులతో కలిసిమెలిసి జరుపుకోవాలి. తోటివిద్యార్థులతో కలిసి ఆటలు ఆడాలి. తినుబండారములు అందరూ కలిసి పంచుకొని ఆరగించాలి. పరస్పరం సహాయసహకారములు అందించుకోవాలి.

సూక్తి

**పంచే కొద్దీ పెరిగేది మంచితనమే**

# 5 దొరికిన పెన్ను

## I. ప్రధాన విలువ

బాధ్యత వహించడం

## II. ఉప విలువ

తమ వస్తువులను జాగ్రత్తగా కాపాడుకోవడం, ఇతరుల వస్తువులపట్ల బాధ్యత వహించడం.

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- ఎవరి వస్తువులు వాళ్ళు జాగ్రత్తగా వాడుకోవడం, కాపాడుకోవడం తెలుసుకుంటారు.
- తమది కాని వస్తువు దొరికినప్పుడు దాన్ని జాగ్రత్తగా ఎవరికి చెందినదో వారికి అందచేయడం తమ బాధ్యతగా తెలుసుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

మనం ఉపయోగించుకునే ఎన్నో రకాల వస్తువులను జాగ్రత్తగా పెట్టుకోవలసిన బాధ్యత మనపైన ఉంది. ఉన్న వస్తువులను పాడుచేసుకొని మళ్ళీ మళ్ళీ కొనుక్కోవడం కంటే వస్తువులను జాగ్రత్తగా వాడుకొని కొత్త వస్తువులు కొనుక్కోవడం మంచిది కదా! అలాగే తమదికాని వస్తువు తమకు దొరికినప్పుడు దాన్ని జాగ్రత్తగా అది ఎవరిదో వారికి అందజేయాలి అని తెలియచేయాలి.

తన వస్తువును అజాగ్రత్తతో పోగొట్టుకున్న కార్తీక్ గురించి దానిని జాగ్రత్తగా తిరిగి అందజేసిన రవి గురించి ఈ కథలో తెలుసుకుందాం.

## V. కథ

ఆరోజు కార్తీక్ పుట్టినరోజు, ఉదయమే అమ్మ నిద్రలేపి తలంటుస్నానం చేయించి కొత్తబట్టలు ఇచ్చింది. కార్తీక్ కొత్తబట్టలు వేసుకుని దేవునికి దండంపెట్టి తల్లిదండ్రులకూ నమస్కరించాడు. అప్పుడు కార్తీక్ తండ్రి పుట్టినరోజు కానుకగా ఒక 'పెన్' బహూకరించాడు. ఆ 'పెన్' చాలా బాగుంది. కార్తీక్‌కు చాలా బాగా నచ్చింది. సంతోషంతో తన స్నేహితులందరికీ చూపించాలని ఆరోజే పాఠశాలకు తీసుకొని వెళ్ళాడు. స్నేహితులందరికీ చాక్లెట్స్ పంచి, తన తండ్రి ఇచ్చిన 'పెన్'ను అందరికీ చూపించాడు. అందరికీ చాలా బాగా నచ్చింది. ఆరోజు ఆపెన్‌తోనే రాస్తున్నాడు. పెన్ చాలా బాగా రాస్తున్నది.

ఇంతలో ఇంటర్ వెల్ బెల్ కొట్టారు. పిల్లలందరూ బయటకు పరుగెత్తారు. కార్తీక్ కూడ పిల్లలతో వెళ్ళి ఆడుకున్నాడు. తిరిగి బెల్ కొట్టగానే తరగతులు మొదలయ్యాయి. ఎవరి తరగతిలో వారు కూర్చున్నారు. కార్తీక్ 'పెన్' కోసం జేబులో చేయిపెట్టగా అది కనిపించలేదు. ప్యాంటు జేబులు, షర్ట్‌జేబులు అన్నీ వెతికాడు అయినా 'పెన్' కనిపించలేదు. బాధ ఎక్కువై కళ్ళలో నుంచి నీరు కారిపోతున్నాయి. కార్తీక్ బాధ చూసి అతని స్నేహితులు టీచర్ పర్మిషన్ తీసుకొని కార్తీక్‌తో కలిసి పాఠశాల ఆవరణలో పెన్ కోసం వెతికారు. అయినా కనపడలేదు. కార్తీక్ ఏడుస్తూనే ఇంటికి వెళ్ళాడు. తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. వారు ఏ వస్తువైనా జాగ్రత్తగా ఉంచుకోవాలి. నీకు అజాగ్రత్త ఎక్కువ అని మందలించారు. ఆరోజు నిద్రలో కలలోకూడా కార్తీక్‌కు ఆ పెన్నే కనిపించింది.

మరుసటిరోజు పాఠశాలలో ప్రార్థనకు హాజరయ్యాడు. ప్రార్థన అయిన తర్వాత ప్రధానోపాధ్యాయులు ఒక పెన్ చూపిస్తూ "నిన్న ఎవరైనా 'పెన్' పోగొట్టుకున్నారా? ఇది 1వ తరగతి విద్యార్థి రవికి ఇంటి వెళ్ళే సమయంలో పాఠశాలలో దొరికిందని" ప్రకటించారు. కార్తీక్ ఆనందానికి అవధులు లేదు. ప్రధానోపాధ్యాయుని వద్దకు వెళ్ళి తనదే అని చెప్పి తీసుకున్నాడు. పక్కనే ఉన్న రవికి కృతజ్ఞతలు తెలిపి తన జేబులోని చాక్లెట్స్‌ను అందించాడు.

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) ఈ కథ వల్ల మీరు ఏమి తెలుసుకున్నారు?

2) మీకిష్టమైన వస్తువులను ఎప్పుడైనా పోగొట్టుకున్నారా? అలా పోగొట్టుకున్నప్పుడు మీకెలా అనిపించింది?

3) పోయిన వస్తువు దొరకడం వల్ల కార్తీక్‌కు ఎలా అనిపించి ఉంటుంది?

4) రవి చేసిన పని మంచి పనేనా? మీరైతే ఏం చేస్తారు?

5) మనం మన వస్తువులను ఎందుకు జాగ్రత్తగా ఉంచుకోవాలి?

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

**కింది వాటిలో ఏవేవి చేస్తున్నారో చెప్పండి. ఏవి చేయడం ఇక మీదట నేర్చుకుంటారో చెప్పండి.**

1) బడికి వచ్చేముందు ఇంటికి వెళ్ళే ముందు బ్యాగులో పుస్తకాలు, పెన్సిలు, రబ్బరు అన్నీ ఉన్నాయో లేదో చూసుకుంటాను.

2) నా ఆట వస్తువులను ఆడుకున్నాక అలమారలో జాగ్రత్తగా పెట్టుకుంటాను.

3) ఇంట్లో ఎక్కడ వస్తువులు తీసినా తిరిగి అక్కడే పెడతాను.

4) ఎవరి వస్తువులు అయినా తీసుకుంటే తిరిగి వారికి జాగ్రత్తగా ఇస్తాను.

5) ఇతరుల వస్తువులను అడగకుండా తీసుకోను.

6) దొరికిన వస్తువులను ఎవరివో అడిగి వారికి ఇస్తాను.

*(గమనిక : పై అంశాలను విద్యార్థులకు చదివి వినిపించండి. ఎంతమంది దేనికి అవును అని దేనికి కాదు అని సమాధానాలు చెప్పారో నల్లబల్లపై రాయండి. వీటిపై ప్రశ్నలు వేస్తూ వస్తువులను ఎందుకు జాగ్రత్తగా ఉంచుకోవాలో తెలియజేయండి.)*

## ఇ) ఆలోచించడం – అనుభవాలు చెప్పడం

పిల్లలూ! మీరు ఏ ఏ వస్తువులను జాగ్రత్తగా చూసుకుంటారో ఎలా చూసుకుంటారో చెప్పండి.

## కథ

హేమంత్, ధీమంత్ ఇద్దరూ స్నేహితులు. చాలా మంచి పిల్లలు. హేమంత్ బాగా చదువుతాడు. ధీమంత్ చదువుతోపాటు మరికొన్ని మంచి గుణాలు గలవాడు. హేమంత్ నాన్నగారు పెద్ద ఉద్యోగి. ధీమంత్ నాన్నగారు సామాన్యమైన ఉద్యోగి. వాళ్ళ ఇండ్లలో కూడా చాలా తేడా ఉంది.

హేమంత్ ఇంట్లో వస్తువులు పెట్టుకోవడానికి ప్రతీదానికి ఏర్పాట్లు చేసి ఉన్నాయి. కానీ, ఏ వస్తువూ ఉండాల్సిన చోట ఉండదు. హేమంత్ కూడా చదివిన తరువాత ఇంటిపని చేశాక ఎక్కడ పుస్తకాలు అక్కడే వదిలేస్తూంటాడు. అదరాబాదరాగా స్కూలుకి తయారై పుస్తకాలన్నీ ఏరి సంచిలో కుక్కి వేస్తాడు. ధీమంత్ వాళ్ళది చిన్నఇల్లే. ఐనా, ఉన్న స్థలంలోనే ప్రతీవస్తువును చక్కగా ఏర్పాటుచేసుకున్నారు. ధీమంత్ కూడా తన పుస్తకాలన్నీ ఇంట్లో చక్కగా సర్దుకుంటాడు. సంచి కూడా బాగా సర్దుకుంటాడు. నోట్సులు, అచ్చు పుస్తకాలు టైంటేబుల్ ప్రకారంగా వరుసలో సంచిలో పెట్టుకుంటారు.

ఒకసారి స్కూలు టీచర్ పాఠం చెప్పాక నోట్సు ఇస్తున్నారు. హేమంత్ నోట్సుకోసం సంచిలోనున్న పుస్తకాలన్నీ తీసి వెతికి వెతికి టైం వృధా చేసుకున్నాడు. కానీ, నోట్సు అందులోలేదు. ఏమైందో? ఎక్కడ పెట్టానోనని ఆలోచించడంతోనే సరిపోయింది. ధీమంత్ తను వ్యవస్థాబద్ధంగా పెట్టుకున్న నోట్సు తీసి గబగబ రాసుకున్నాడు. ఒకసారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల్ని కలుస్తూ హేమంత్, ధీమంత్ ఇండ్లకు కూడా వెళ్ళారు. హేమంత్ వాళ్ళ ఇల్లు పెద్దదే. పైగా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. కానీ, ఇంట్లో వస్తువులేవీ ఉండాల్సిన విధంగా లేవు. హేమంత్ నాన్నగారు వాళ్ళ ఫోటో ఆల్బమ్ ప్రధానోపాధ్యాయునికి చూపాలని ప్రయత్నించి ఇల్లంతా వెతికారు. కానీ కనబడలేదు. విసుకున్నారు. సర్లెండి. కాలాతీతమైంది అంటూ ఉపాధ్యాయులు వెళ్ళిపోయారు. ధీమంత్ ఇల్లు చిన్నది సామాన్యంగా ఉంది. కానీ ఎంతో వ్యవస్థాబద్ధంగా సర్దుకున్నారు. దానిని చూసి ఉపాధ్యాయులు ముచ్చటపడ్డారు. మర్నాడు స్కూల్‌లో టీచర్ నైతిక శిక్షణ పీరియడ్‌లో చక్కని కథని చెప్పి ఉదాహరణగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. దాంతో హేమంత్ సిగ్గుపడ్డాడు. నాటి నుండి హేమంత్ కూడా తన ఇంటిని, ఇంట్లో తన వస్తువుల్ని చక్కగా సర్దుకునేవాడు. ఇప్పుడు అతనికి తరగతిలో ఇబ్బందిలేదు. ఇంట్లో కూడా ఇబ్బంది లేదు. పైగా వారి తల్లిదండ్రుల్లో కూడా ఎంతో మార్పు వచ్చింది. చూశారా! చక్కని వ్యవస్థవలన ఎన్ని లాభాలో! ఎంత మంచి జరుగుతుందో! అందుకే మన వస్తువులను మనం చక్కగా ఏర్పాటు చేసుకోవాలి.

**సూక్తి**

**మన దగ్గర ఉన్న వేటినైనా వస్తువులను జాగ్రత్తగా చూసుకోవడమనే లక్షణంపైనే మన రేపటి పొదుపు ఆధారపడి ఉంటుంది**

# 6 పొదుపు

## I. ప్రధాన విలువ

పొదుపు

## II. ఉప విలువ

వస్తువులను పొదుపుగా వాడుకోవడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- పొదుపు యొక్క విలువను గుర్తింపజేయడం.
- వస్తువులను పొదుపుగా వాడుకోవాలని తెలియజేయడం.

## IV. ఉపోద్ఘాతం

మనం సంపాదించిన ధనాన్ని మనకు ఉన్న వస్తువులను అవసరాన్ని బట్టి జాగ్రత్తగా వాడుకోవడమే పొదుపు. అనగా డబ్బులైనా, లేక ఏ వస్తువులైనా అవసరం ఉన్నంతమేరకే ఉపయోగించుకోవాలి. అంతకంటే ఎక్కువగా ఉపయోగించి దుబారా చేయడంవల్ల అవసరానికి లేకుండా పోతుంది. పొదుపు చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకు అందరకు అన్ని విషయాల్లో అవసరం.

## V. సంఘటన

*గాంధీతాత ఒక రోజు తన గదిలో చాలా సేపటి నుంచి వెతుకుతున్నారు. దానిని చూసిన మీరాబెన్ దేనికోసం వెతుకుతున్నారు అని అడిగింది. నా పెన్సిల్ ఎక్కడో పడిపోయిందమ్మా! దాని గురించి వెతుకుతున్నాను అన్నారు. ఇది విన్న ఆశ్రమంలోని వారు గాంధీజీకి ఒక కొత్త పెన్సిల్ తెచ్చి ఇచ్చారు. కానీ గాంధీజీ తన పెన్సిల్ కోసం వెతుకుతూనే ఉన్నారు. అంతలో గాంధీజీగారికి తన పెన్సిల్ కనిపించింది. ఆనందంగా! ఆ! దొరికింది అని చేతిలోనికి తీసుకున్నారు. దానిని చూసిన అందరూ ఆశ్చర్యపోయారు. ఇంత చిన్న పెన్సిల్ కోసమా మీరు వెదికింది అన్నది మీరాబెన్. ఏమ్మా! చిన్న పెన్సిల్ అయితే ఏం రాయడానికి పనికొస్తుంది కదా! అన్నారు గాంధీజీ. అందుకే ఏ వస్తువునైనా జాగ్రత్తగా పొదుపుగా వాడుకోవాలి.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) ఈ సంఘటన వల్ల మీరు ఏమి తెలుసుకున్నారు?

2) మీరు ఏ ఏ వస్తువులను పొదుపు చేస్తారు?

3) పొదుపు చేయడం వల్ల మనకు కలిగే లాభాలేమి?

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

కింది వస్తువులను మీరు ఎలా పొదుపుగా వాడుకుంటారో చెప్పండి.

1) పుస్తకాలు, 2) పెన్నులు, 3) పెన్సిళ్ళు, 4) రబ్బరు (ఎరేజర్), 5) దుస్తులు

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

పైన మీరు చెప్పిన విధంగా ఒక వారం రోజులు ఆచరించండి. మీకు కలిగిన లాభాలు చెప్పండి.

**సూక్తి**

**మనం చేసే పొదుపుతో మనకే కాదు ఇతరులకూ సహాయం చేయవచ్చు**

# 7 దంతాల పరిశుభ్రత

## I. ప్రధాన విలువ

ఆరోగ్యం

## II. ఉప విలువ

దంతాల పరిశుభ్రత

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- పళ్ళను శుభ్రంగా ఉంచుకోకపోవడం వల్ల వచ్చే పంటి జబ్బుల గురించి తెలుసుకుంటారు.
- దంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

మనం ఏమి తినాలన్నా పళ్ళు అవసరం. మనం రకరకాల పదార్థాలను తినేటప్పుడు ఆ పదార్థాలు మన దంతాల మధ్యలో ఇరుక్కుపోతాయి. పళ్ళను సరిగా శుభ్రం చేసుకోకపోతే నోరు దుర్వాసన వస్తుంది. అంతేకాదు. పళ్ళు పుచ్చిపోయి ఊడిపోతాయి కూడా. అందుకే దంతాలకు హాని కలిగించే పదార్థాలు తినకూడదు. ఏదైనా తిన్న తర్వాత దంతాలను శుభ్రపరచుకోవాలి. మనం ఇప్పుడు గోవిందు అనే పిల్లవాడు తన దంతాలను ఎలా పాడుచేసుకున్నాడు? దానికి అతను ఎలా బాధపడ్డాడో తెలుసుకుందాం.

## V. కథ

*గోవిందు అనే పిల్లవాడికి పళ్ళు తోముకోవడమంటే బద్ధకం అతనెప్పుడూ పళ్ళు సరిగా తోముకోడు. దానికి తోడు దంతాలకు హాని కలిగించే చాక్లెట్లు, స్వీట్లు, ఐసుక్రీములు మొదలైన వాటిని ఎక్కువగా తింటాడు. వాళ్ళు సరిగా తోమకపోవడం వల్ల అతని నోటి నుండి దుర్వాసన వచ్చేది. అతనితో మాట్లాడే తోటి పిల్లలు క్రమంగా అతనితో మాట్లాడడం మానేసారు. అతని పళ్ళు పుచ్చిపోయి నొప్పివస్తున్నాయి. బడిలో బాలల దినోత్సవంనాడు పిల్లలందరికి లడ్డూలు ఇచ్చారు. అందరూ వాటిని చాలా ఇష్టంగా తిన్నారు. గోవిందు కూడా తిందామనుకున్నా పంటినొప్పి వల్ల తినలేకపోయాడు. అప్పుడు టీచరు చెప్పిన మాటలు అతనికి జ్ఞాపకం వచ్చాయి. తాను రోజూ పళ్ళు సరిగా తోముకోకపోవడం, దంతాలకు హాని కలిగించే పదార్థాలను మితిమీరి తినడంవల్ల ఈ బాధ కలిగిందని తెలుసుకొని తన అలవాటును మార్చుకున్నాడు. ప్రతిరోజు ఉదయం మరియు రాత్రి చక్కగా పండ్లు తోముకుని, నాలుక గీసుకోవడం అలవాటు చేసుకున్నారు. దంతాలకు హాని కలిగించే పదార్థాలను తినడం తగ్గించేసాడు. పుచ్చిన పళ్ళకు చికిత్స చేయించుకున్నాడు. తిరిగి అతని పళ్ళు చక్కగా ఉన్నాయి. స్నేహితులు కూడా అతని నోటి నుండి దుర్వాసన రాకపోవడం వల్ల చక్కగా మాట్లాడుతున్నారు. ఆనాటి నుండి అతడు తన దంతాలను క్రమం తప్పకుండా శుభ్రపరుచుకొనేవాడు.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) పిల్లలందరూ గోవిందుతో మాట్లాడటం ఎందుకు మానేశారు?

2) దంతాలను ఎందుకు శుభ్రం చేసుకోవాలి?

3) దంతాలకు హాని కలిగించే పదార్థాలు ఏవి? అవి తిన్న తర్వాత ఏం చేయాలి?

4) పళ్ళు చక్కగా ఉండాలంటే మీరేమి చేస్తారో చెప్పండి?

5) మనం ఉదయం మరియు రాత్రి భోజనం చేసిన తరువాత పండ్లు తోముకోవాలి. రాత్రి కూడా ఎందుకు?

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

1) ఇద్దరిద్దరు జతగా కూర్చొని దంతాలను పరిశీలించి ఎవరి దంతాలు ఎలా ఉన్నాయో చెప్పండి.

*(మొత్తం తరగతి పిల్లల్ని రెండు గ్రూపులుగా చేసి ఒక గ్రూపువారు ప్రశ్నలు - మరొక గ్రూపు వారు జవాబులు చెప్పేటట్లుగా చేయించండి.)*

ఉదా॥

| మొదటి గ్రూపు | రెండవ గ్రూపు |
|---|---|
| అ) ప్రతి రోజు మీరు పళ్ళు తోముతారా? | అవును, తోముతాము. |
| ఆ) ఎన్ని సార్లు తోముతారు? | రెండు సార్లు. |
| ఇ) అన్నం తిన్న తరువాత నీటితో నోటిని పుక్కిలిస్తారా? | అవును పుక్కిలిస్తాము. |
| ఈ) --------------------- | --------------------- |
| ఉ) --------------------- | --------------------- |

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

ఉదయం నిద్ర లేవగానే, రాత్రి పడుకోబోయే ముందు పళ్ళు తోమండి. వారం రోజుల తరువాత మీకు ఎలా అనిపించిందో మీ అనుభవాన్ని తెల్పండి.

### సూక్తి

**మంచి ఆరోగ్యం మనిషి మనుగడకు మూలం**

**ఆరోగ్య భాగ్యం అందలమెక్కించే సుమార్గం**

# 8 వేషధారణ

**I. ప్రధాన విలువ**

సంస్కృతి - సంప్రదాయాలు

**II. ఉప విలువ**

వివిధ సాంప్రదాయ వేషధారణలను గౌరవించడం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు**

- సంస్కృతిలో వేషధారణ ఒక భాగమని తెలియజేయడం.
- మన సంస్కృతికి తగినట్లుగా వేషధారణ ఉంటే గౌరవం లభిస్తుందని తెలుసుకోవడం.
- వివిధ సంస్కృతుల వారి వేషధారణలను గౌరవించడం.

**IV. ఉపోద్ఘాతం**

మనమందరం శరీరాన్ని కాపాడుకోవడానికి దుస్తులు ధరిస్తాము. అయితే అందరూ ఒకేలా ధరించరు. వివిధ వేడుకల్లో రకరకాల మతాల వాళ్ళు, ప్రాంతాల వాళ్ళు ధరించే వేషధారణ ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుంది. వారి వారి సాంప్రదాయం ప్రకారం ఉండే వేషధారణను మనం గౌరవించాలి.

## V. సన్నివేశం

*పిల్లలందరూ, టీచర్లతో కలిసి గోల్కొండ కోటను చూడడానికి వెళ్ళారు. అక్కడి చరిత్రను తెలుసుకొంటూ ఆనాటి కథలను టీచరు చెబుతుంటే ఉత్సాహంగా వింటున్నారు. ఇంకా చాలా మంది గోల్కొండను చూడడానికి వచ్చారు. ఆ వచ్చిన వారిని చూస్తున్న ఉమ వారి వేషధారణను చూడగానే మన ప్రాంతం వారిలాగా అనిపించక టీచరును అడిగింది. అప్పుడు టీచరు వాళ్ళు మరాఠా వారు, వీళ్ళు గుజరాతీయులు, పంజాబీలు, తమిళులు అని, వారి వేషధారణ వారి సాంప్రదాయానికి తగినట్లుగా ఉన్నదని వివరించారు. ఎవరు ఎలాంటి వేషధారణ ధరించినా అది వారి కుల, ప్రాంత, మత సంస్కృతులను ప్రతిబింబిస్తూ ఉంటుందని పరస్పరం ఒకరిని ఒకరు గౌరవించుకోవడమే సంస్కృతి సాంప్రదాయంలో గొప్పతనమని టీచరు చెప్పింది.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) నీకు ఎన్ని రకాల దుస్తులు ఉన్నాయి? వాటిలో నీకు నచ్చిన దుస్తులు ఏవి? ఎందుకు?

2) మన వేషధారణ వేర్వేరుగా ఎందుకున్నది?

3) పెళ్ళిళ్ళలో మన వేషధారణ వేరుగా ఉంటుంది కదా! ఇంకా ఏయే సందర్భాలలో వేషధారణ వేర్వేరుగా ఉంటుంది?

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

రెండు జట్లుగా ఏర్పడి 1వ జట్టు పురుషులు ధరించే వస్త్రాలను గూర్చి చెప్పండి. మరొక జట్టు స్త్రీలు ధరించే వస్త్రాలను గూర్చి చెప్పండి.

***(గమనిక : విద్యార్థులచే చెప్పించండి. వీటిపై ప్రశ్నలు వేస్తూ వివిధ ప్రాంతాలవారికి, మతాలవారికి వారి వారి సాంప్రదాయం ప్రకారం వేషధారణ ఉంటుందని. వారిని మనం గౌరవించాలని తెలియజేయాలి.)***

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1) బడికి వచ్చినప్పుడు, ఇంట్లో ఉన్నప్పుడు నీ వేషధారణ ఒకేలా ఉంటుందా? మారుతుందా? ఎందుకు?

2) ఇంట్లో, బయట, పెళ్ళిళ్ళు, వేడుకల్లో రకరకాల వేషధారణను (దుస్తులను) చాలామంది ధరిస్తారు. ఎందుకో ఇంట్లో వాళ్ళను అడిగి తెలుసుకోండి.

3) నీకు నచ్చిన వేషధారణకు సంబంధించిన బొమ్మలు / చిత్రాలు, ఫోటోలు సేకరించండి. ప్రదర్శించండి.

వేషోభాషా సదాచారః రక్షణీయం ఇదంత్రయం।
అంధాను కరణ మన్యేషాం అకీర్తి కరముచ్చతే॥

**భావం :** సమస్త దేశానికి అభ్యుదయం కలిగించే త్రికం ఒక్కటే. అదే వేషం, భాష, సదాచారము. ఇతర దేశాల వేషభాషలను, ఆచారాలను గ్రుడ్డిగా అనుకరిస్తే అపకీర్తి కలుగుతుంది. మన సదాచారాన్ని పాటిస్తే మేలు జరుగుతుంది.

**సూక్తి**

**సంప్రదాయ దుస్తులు ధరిద్దాం మన సంస్కృతిని కాపాడుకుందాం. మన దేశగౌరవాన్ని చాటుదాం.**

# 9 చెట్లు మన నేస్తాలు

## I. ప్రధాన విలువ

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడం

## II. ఉప విలువ

చెట్ల ఉపయోగాలను తెలుసుకోవడం - తగిన విధంగా ప్రవర్తించడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- పిల్లలు చెట్లను పెంచడంవల్ల కలిగే ఉపయోగాలను తెల్సుకొనగలగడం.
- చెట్ల ఉపయోగాలు తెల్సుకొని వాటిని పెంచి పోషించడంలో తగిన విధంగా ప్రవర్తించగలగడం.

## IV. ఉపోద్ఘాతం

మొక్కలు మన నేస్తాలు. అవి మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతాయి. మనం నిద్రలేచినప్పటి నుండి తినే ఆహారం మొదలుకొని రాత్రిపూట పడుకునే మంచం వరకు అన్నీ చెట్ల నుండి మనకు లభించేవే చెట్లు లేకపోతే మనం ఈ భూమి మీద జీవించలేం కనుక చెట్లను నరకకూడదు కాపాడుకోవాలి. మొక్కలను పెంచాలి.

## V. విషయ వివరణ

### 1. చెట్టు బహుమానం

ఒక రాజు గుర్రం మీద విహారానికి వెళ్తూ ఉన్నాడు. ఒక ముసలివాడు మొక్కను నాటుతూ ఆ రాజుకు కనిపించాడు. ఏం చేస్తున్నావని రాజు ముసలివాడ్ని ప్రశ్నించాడు. మహారాజా! నేను ఒక మామిడి మొక్కను నాటుతున్నానని చెప్పాడు. "ఈ మొక్క ఎప్పటికి కాయలు కాస్తుంద"ని రాజు ప్రశ్నించాడు.

"ఇరవై సంవత్సరాలు పట్టవచ్చు మహారాజా!"

"నీవు ఈ చెట్టు యొక్క పండ్లను తినగలనని అనుకుంటున్నావా?

"లేదు మహారాజా! ఈ చెట్టుకు పండ్లు కాసేటప్పటికి బహుశా నేను ఈ లోకంలో ఉండకపోవచ్చు. కానీ నా మనుమనికి వీటి ఫలాలు, కలప తప్పక ఉపయోగపడుతుందని వాడి పుట్టిన రోజున నాటుతున్నాను" అని ఎంతో ఆనందంగా సమాధానమిచ్చాడు.

మనుమడు గోపి ఇదంతా గమనిస్తూ ఉన్నాడు. తాతయ్య తన కోసం ఓ మొక్కను నాటాడని మురిసిపోయాడు. రోజూ దానికి నీళ్ళుపోశాడు. చుట్టూ కంపవేసి రక్షణ చేశాడు. తను పెరుగుతున్న కొద్దీ మొక్క కూడా బాగా పెరుగుతూవచ్చింది. తనకు 20 సంవత్సరాలు వచ్చేసరికి ఆ చెట్టుక్కూడా మామిడికాయలు విపరీతంగా కాస్తున్నాయి. గోపి ఆ పండ్లను అమ్ముకుంటూ హాయిగా జీవితం గడుపుతూ ఉన్నాడు. ప్రతి పండుగకు తోరణాల కోసం మామిడి ఆకులు అందరికీ పంచుతున్నాడు. మామిడి చెట్టు బాగా పెద్దదైంది. గోపీ ఇంటి అవసరాల కోసం ఒక రోజు మామిడి చెట్టు మానుతో పడవను తయారుచేసుకోమన్నది. అలాగే గోపీ పడవను చేసుకొని చేపల వేటకు వెళ్ళి చేపలు పట్టుకొని అమ్ముకుంటూ డబ్బు సంపాదించాడు. మిగిలిన కలపతో ఇల్లు కూడా కట్టుకున్నాడు. చివరకు నేల మట్టం వరకు నరికిన మొండెంతో ఉండి కూడా గోపికి కూర్చునే ఆసనంలాగా ఆ మామిడిచెట్టు ఉపయోగపడింది. గోపి కృతజ్ఞతలతో తన తాతవలె ప్రతి సంవత్సరం తన పుట్టిన రోజుకు ఓ మొక్కను నాటడం మాత్రం మర్చిపోలేదు.

### 2. కథ

2వ తరగతి పిల్లలందరూ వారి ఉపాధ్యాయులతో కలిసి ఒక పార్కుకు వెళ్ళారు. అక్కడ ఉన్న ఆటవస్తువులతో బాగా ఆడుకున్నారు. అక్కడి ఆటస్థలంలో కూడా ఆటలు ఆడారు మధ్యాహ్నానికి అందరూ అలసిపోయారు. తమ టిఫిన్ బాక్సులు తీసుకుని అందరూ ఒక చెట్టు కింద చేరారు.

చెట్టు కిందికి రాంగానే వారికి హాయిగా అనిపించింది. వారిలో సాగర్ "అబ్బ! చెట్టు కింద ఎంత చల్లగా ఉంది మంచిగా గాలి వస్తోంది. ఎంత బాగుందో" అన్నాడు. "అవును చెట్టు మనకు నీడను ఇస్తుంది. తినడానికి మంచి పండ్లను కూడా ఇస్తుంది" అన్నది ప్రత్యూష. వీరి మాటలు వింటున్న వారి ఉపాధ్యాయుడు "అంతే కాదురా! చెట్లు మనకు చాలా రకాలుగా ఉపయోగపడతాయి. మీరందరూ భోంచేసి రండి మీకు చెట్ల గురించి చెపుతాను" అన్నాడు. పిల్లలందరూ భోంచేసి మాస్టారి చుట్టూ చేరారు.

మాష్టారు పిల్లలతో "చెట్లు మనకు గాలి, నీడ, పండ్లు ఇస్తాయని మీకు తెలుసు కదా! ఇంకా మనకు కావలసిన చాలా వస్తువులు కుర్చీలు, బల్లలు, మంచాలు, కిటికీలు, తలుపులు తయారుచేయడానికి చెట్లే ఉపయోగపడతాయి. మనం బతకడానికి కావలసిన ఆహారపదార్థాలు, ఆక్సిజన్ కూడ చెట్ల నుండే వస్తాయి. మనం రాసుకునే కాగితం కూడ చెట్ల నుండే వస్తుంది. అంతే కాకుండా వర్షాలు కురవాలన్నా చెట్లే కారణం అంతెందుకు చెట్లులేకపోతే భూమి మీద ఏ జీవి జీవించలేదు కనుక చెట్లను మనం కాపాడుకోవాలా? నరికివేయాలా?" అన్నాడు.

"అమ్మో! ఇంతగా మనకు ఉపయోగపడే చెట్లను నరికివేయడమా! కాదు కాదు కాపాడుకోవాలి" అన్నారు పిల్లలంతా.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) చెట్టు బహుమానం కథ విన్నారు కదా పిల్లలూ! ఈ కథ నుండి మీరేమి తెలుసుకున్నారు?

2) చెట్టువలన ఏ ఏ ప్రయోజనాలున్నాయో ఒక్కొక్కరుగా చెప్పండి.

3) కథలో గోపీ చెట్లను పెంచి లాభాలను పొందాడు కదా! మరి మీరు ఏ విధంగా చెట్లను పెంచి పోషిస్తారో చెప్పండి.

4) చెట్ల గురించి టీచర్ చెప్పింది విన్నారు కదా! ఇంకా చెట్లవల్ల మనకు ఏ ఏ ఉపయోగాలున్నాయో చెప్పండి.

5) మన చుట్టూ చెట్లే లేకపోతే ఎలా ఉంటుంది? ఏమవుతుంది?

6) చెట్లను మనం ఎలా కాపాడుకోవాలి? మీరైతే ఏం చేస్తారు?

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

1) పిల్లలూ! అభినయిస్తూ ఈ గేయం పాడండి.

బాలల్లారా రారండి - చిన్న మొక్కలు నాటండి
చక్కని పాదులు చేయండి - నీటిని తప్పక పోయండి
ఎదిగెను మొక్క చూడండి - పూలు పండ్లు మీ కండి
పండ్లను బాగా తినరండి - ఆరోగ్యంగా ఉండండి.

2) మీకు నచ్చిన చెట్టు బొమ్మ గీసి రంగు దిద్దండి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1) మీ ఇంట్లో ఏమేమి చెట్లు ఉన్నాయో చెప్పండి. వాటికి రోజూ నీరు పోసి జాగ్రత్తగా పెంచండి. మీకు ఎలా అనిపించిందీ చెప్పండి.

2) మీరు పెంచిన చెట్టు పూలు పూస్తే, కాయలుకాస్తే మీకు ఎలా అనిపిస్తుంది.

**సూక్తి**

వృక్షో రక్షతి రక్షితః. వానలు కురవాలన్నా, ప్రకృతి రక్షించబడాలన్నా చెట్లు పెంచాలి. అవి మనల్ని రక్షిస్తాయి.

# 10 పద్ధతిగా చేద్దాం

## I. ప్రధాన విలువ

శాస్త్రీయ దృక్పథం

## II. ఉప విలువ

ఇచ్చిన పనిని సక్రమంగా చేయడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- ఏదైన ఒక పని చేయడంలో ఒక క్రమ పద్ధతి ఉంటుంది అని తెలుసుకుంటారు.
- పనిని చక్కగా పూర్తి చేయాలంటే ఒక క్రమంలో ఆలోచించడం అవసరం అని తెలుసుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

మనం ప్రతి రోజు నిద్రలేచింది మొదలు, రాత్రి పడుకునే వరకు ఎన్నో రకాల పనులను చేస్తూ ఉంటాము. వాటిని ఒక క్రమ పద్ధతిలో చేసినప్పుడే అవి పూర్తి అవుతాయి. పనులను ఆలోచిస్తూ బాధ్యతాయుతంగా చేయాలి. ఒకవేళ ఆ పనులను సరైన క్రమంలో చేయకపోతే వాటిని సక్రమంగా పూర్తిచేయలేము.

## V. విషయ వివరణ

'వన మహోత్సవం' సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థి గ్రామంలో ఒక మొక్కను నాటి వాటిని జాగ్రత్తగా పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. ఆయన సూచన మేరకు వివేక్, అఖిల్ అనే ఇద్దరు విద్యార్థులు మొక్కలు ఎలా నాటారో చూద్దాం.

వివేక్, అఖిల్ ఇద్దరూ గ్రామంలో ఒక ఖాళీ ప్రదేశాన్ని చెరో మొక్క నాటడానికి తీసుకున్నారు. వివేక్ తను తీసుకున్న మొక్కను నాటేచోట మొదట నీటితో తడిపాడు. తర్వాత అక్కడ ఒక పాదును తవ్వాడు. మళ్ళీ గోతిని నీటితో తడిపి అందులో కొంచెం పశువుల ఎరువును వేసి అందులో తాను నాటాల్సిన మొక్కను ఉంచి, మొక్కకు చుట్టూరా మట్టితో నింపివేశాడు. ఆ రోజు వివేక్ రెండు పూటలా నీళ్ళు పోసాడు. మరుసటి రోజు ఆ మొక్క చూడగా పచ్చగా కనిపించింది.

ఇక అఖిల్ కూడా గ్రామంలో ఒక చోట చిన్న గుంత తవ్వి అందులో మొక్కను నాటాడు. గుంతలో మట్టిని కూడా సరిగా నింపలేదు. అలాగే వదిలి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు అఖిల్ తను నాటిన మొక్కను చూసేసరికి అది ఎండిపోయి ఒక పక్కన వాలిపోయి పడి ఉంది.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) వివేక్ నాటిన మొక్క పచ్చగా ఎదగటానికి అఖిల్ మొక్క వాడిపోవడానికి కారణం ఏమై ఉంటుంది?

2) మీరు చేసిన ఏదైనా ఒక పనిని ఎలా చేశారో చెప్పండి.

3) ఒక పనిని మీరు క్రమంగా చేస్తే ఏమౌతుంది, క్రమంగా చేయకపోతే ఏమౌతుందో చెప్పండి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- పిల్లలూ... మీరు గాలి పటాన్ని తయారుచేయండి. మీరు తయారుచేసిన విధానాన్ని ఒక్కొక్కరుగా చెప్పండి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

మీ అమ్మగారు మీ ఇంట్లో అన్నం / దోస / వడ / రోటీ ఎలా వండుతుందో కదా! అవి ఎలా వండుతుందో తెలుసుకొని ఆ క్రమాన్ని వివరించండి.

**సూక్తి**

ఏ విషయమైనా చెప్పే ముందు ఆలోచించాలి.

క్రమపద్ధతిలో చెప్పాలి.

# 11 ఎవరైనా ఒక్కటే

## I. ప్రధాన విలువ

న్యాయం

## II. ఉప విలువ

అందరికీ ఒకే న్యాయమని గుర్తించడం.

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

న్యాయమనేది అందరికీ ఒకేలా ఉంటుందని గుర్తింపజేయడం.

## IV. ఉపోద్ఘాతం

మనందరికీ కొన్ని కట్టుబాట్లు, నియామాలు ఉంటాయి. ఇవి అందరికీ ఒకేలా ఉంటాయి. ఇందులో ఒకరికి ఒక న్యాయం మరొకరికి ఒక న్యాయం అనేది ఉండదు. న్యాయం దృష్టిలో అందరూ ఒక్కటే అని తెలియజేయడానికి ఈ సంఘటనను చూడండి.

## V. సంఘటన

*పిల్లలంతా కలిసి కబడ్డీ ఆట ఆడాలనుకున్నారు. జట్లుగా తయారయ్యారు. ఆట నియమాలు చెప్పుకున్నారు. ఎవరైనా నియమం తప్పితే వాళ్ళని ఆడనివ్వకూడదు అని నిర్ణయించుకున్నారు. ప్రకాష్ జట్టు, రవి జట్టు ఆట మొదలెట్టారు. ప్రకాష్ జట్టులో వినయ్ బాగా లావుగా ఉంటాడు. బాగా ఆడుతాడు కూడా పైగా మొండివాడు. నేను బాగా ఆడుతాను నన్నెవరూ పట్టుకోలేరు నేను ఏం చేసినా ఆటలో చెల్లుతుందనే స్వభావం వినయ్‌ది. ఆట మొదలైంది వినయ్ కూతకు వెళ్ళాడు. అవతల గీత తాకకుండా వచ్చాడు. పైగా నేను గీతను తాకాను అని దబాయించాడు. కాని రవి జట్టువాళ్ళు ఒప్పుకోలేదు. న్యాయంగా చూస్తే వినయ్ ఆడకూడదు. కానీ వినయ్ మంచి ఆటగాడని ఆడనివ్వాలని పట్టుబట్టారు. రెండు జట్లు టీచర్ దగ్గరికి వెళ్ళారు విషయం చెప్పారు. బాగా ఆటతెలిసిన వినయ్ తప్పు ఆట ఆడాడు. ఆటలో నియమం తప్పితే ఆడనివ్వకూడదు. న్యాయం ఎవరికైనా ఒక్కటే అంది టీచర్. ఆరోజు ఆటలో నుండి వినయ్‌ను తప్పించారు. వినయ్ లేకపోవడంతో ప్రకాష్ జట్టు ఆటలో ఓడిపోయింది.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) వినయ్ ఎంత బాగా ఆడేవాడైనా ఆటలో నుండి ఎందుకు తప్పించారు? ఇది సరైనదేనా?

2) పాఠశాల వార్షికోత్సవంలో అందరూ కుర్చీలలో కూర్చొని ఉన్నారు. ఇంతలో అక్కడికి ఒక ధనవంతుడు కుటుంబంతో వచ్చాడు. ముందు కుర్చీలలో కూర్చున్న పేదవాళ్ళను లేపి వాళ్ళని కూర్చోపెట్టారు. ఇది న్యాయమేనా?

3) స్కూల్‌లో చాక్లెట్‌లు పంచమని హెడ్‌మాస్టర్ రవికి చాక్లెట్ పాకెట్ ఇచ్చాడు. అందరికీ రెండేసి చొప్పున చాక్లెట్‌లు పంచమన్నాడు. 3, 4, 5 తరగతుల పిల్లలకు రెండేసి చాక్లెట్లు ఇచ్చిన రవి 1, 2 తరగతుల చిన్న పిల్లలే కదా! అని ఒక్కో చాక్లెట్టే ఇచ్చాడు. ఇది సరైనదేనా?

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

పిల్లలూ! బడిలో చదివే పిల్లలందరూ పాటించే నియమాలు కొన్ని ఉన్నాయి. ఇవి అందరికీ సమానంగా ఉంటాయి. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అని లేదు.

ఉదా :
- బడి వేళకు బడికి రావాలి.
- ప్రార్థనలో వరుసగా నిలబడాలి.

ఇలాంటివి మీరూ మరికొన్ని చెప్పండి.

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

మీ ఇంట్లో ఎవరెవరు ఏ ఏ నియమాలు పాటిస్తారు? ఎవరైనా పాటించకపోతే పెద్దలు అందర్నీ ఒకేలా చూస్తారా? లేదా వేరుగా చూస్తారా?

**సూక్తి**

**ప్రకృతి ముందు మన మందరము సమానమే.**
**మరి మనకెందుకు ఈ తేడాలు.**

# 12 భూతదయ

## I. ప్రధాన విలువ

శాంతి / కలిసి మెలిసి జీవించడం

## II. ఉప విలువ

జీవులపై దయ కలిగి ఉండడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- మన చుట్టూ ఉన్న జీవరాశుల పట్ల దయ కలిగి ఉండాలని తెలుసుకుంటారు.
- మనం చేసే పనులు ఇతర జీవులకు బాధ కలిగించకూడదని తెలుసుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

ఈ భూమి మీద ప్రతి ఒక్క జీవరాశికి ఆనందంగా, స్వేచ్ఛగా బతికే హక్కు ఉంది. ఎవరివల్లనైనా జంతువులకు కష్టం కలిగితే అవి కూడా మనలాగే బాధపడ్తాయి. మనతోబాటు సమానంగా జీవించే హక్కు కల్గిన వాటిపట్ల మనం ప్రేమ కల్గి ఉండాలి. అలా ప్రేమతో చూసినప్పుడు వాటికి సంతోషం కలగడమేకాకుండా మన పట్ల ఎంతో విశ్వాసంగా ఉంటాయి. ఇతర జీవులను ప్రేమగా చూడడం వల్ల అశోక్‌కు ఎంత మేలు జరిగిందో ఈ సన్నివేశం వినండి.

## V. విషయ వివరణ

అశోక్ వాళ్ళ ఇంటికి ఒకరోజు ఒక ఊరకుక్క వచ్చింది. అశోక్ వాళ్ళ అమ్మకు కుక్కలంటే అసహ్యం. ఛీ ఛీ... పాడుకుక్క అని తరిమివేసింది. కానీ అశోక్‌కు ఆ కుక్కను చూస్తే జాలేసింది. తను తినే అన్నంలో కొంత దాచి కుక్కకు పెట్టాడు. ఇలా రోజూ ఏదో ఒకటి కుక్కకు పెట్టేవాడు. కుక్క అశోక్ ఎక్కడికి వెళితే అక్కడికి వచ్చేది. అశోక్‌ను చూస్తే చాలు ఆనందంతో తోక ఊపేది. దూరం నుండి చూసి పరిగెత్తుకొచ్చేది.

ఒకరోజు రాత్రి అశోక్ ఇంటిలో దొంగలు పడ్డారు. అందరూ ఆదమరచి నిద్రపోతున్నారు. దొంగల్ని చూసిన కుక్క మొరిగింది. ఆ దొంగలపై పడి రక్కింది. దొంగలు కూడా కుక్కని కర్రతో బాదారు. ఈ అరుపులకు ఇంట్లో వాళ్ళు లేచారు. అందరూ లేవగానే దొంగలు పారిపోయారు. అశోక్ కుక్కను చూశాడు అది దెబ్బతగిలి మూల్గుతూ ఉంది. అశోక్ అమ్మ, నాన్న అందరూ ఈ రోజు కుక్క ఉండబట్టే మన ఇల్లు రక్షించుకోగలిగాము అని వెంటనే కుక్కకు కట్టు కట్టారు. ఆ రోజు నుండి అశోక్‌తోపాటు ఇంట్లో వాళ్ళందరూ కుక్కను తమ ఇంట్లో మనిషిలాగా చూడడం మొదలెట్టారు.

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) అశోక్ కుక్కను పెంచాడు కదా! మనం ఇంకా ఏ ఏ జంతువులను పెంచుతాం? ఎందుకు పెంచుతాం?

2) కొందరు పక్షుల్ని, జంతువులను రాళ్ళతో కొడుతుంటారు. హింసిస్తూ ఉంటారు. ఇలా చేసినప్పుడు అవి ఎలా బాధపడ్తాయి? వాటికి ఏమనిపిస్తుంది?

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

పిల్లలూ! మీరు ఒక్కొక్కరు ఒక్కో జంతువులా నటించాలి. మనుషులు మిమ్మల్ని ఎలా కష్టపెడుతున్నారో చెప్పాలి. మీతో వాళ్ళు ఎలా ఉంటే బాగుంటుందో చెప్పాలి.

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

పిల్లలూ! మీ చుట్టుపక్కల ఇళ్ళలోనివారు ఏ ఏ జంతువులను పెంచుకుంటున్నారో వాళ్ళు ఎంత ప్రేమగా చూసుకుంటున్నారో గమనించి చెప్పండి.

## కథ

సిద్ధార్థుడు, దేవదత్తుడు ప్రాణమిత్రులు. సిద్ధార్థుడు బాహ్య ప్రపంచానికి ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడయ్యేవాడు. ఒకసారి మిత్రులిద్దరూ ఉద్యానవనంలో వాహ్యాళికి వెళ్ళారు. అక్కడ సరస్సులోని కమలములను చూస్తూ సిద్ధార్థుడు తన్మయత్వంలో మునిగిపోయాడు. అదే సమయంలో దేవదత్తుడు దూరంగా ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుచున్న హంసల గుంపును చూశాడు. వాటిని వెంబడించి వాడి గల బాణాన్ని సంధించాడు. ఆ బాణం ఒక హంసకు తగిలి విలవిల కొట్టుకుంటూ సిద్ధార్థుని ముందుకు వచ్చి పడింది. సిద్ధార్థుడు ఆ హంసస్థితికి జాలిపడి, బాణాన్ని తీసి, గాయానికి చికిత్సచేసి హంసను బ్రతికించాడు.

కొంతసేపటికి అక్కడికి దేవదత్తుడు వచ్చి "ఈ హంసను నేను నేలకూల్చాను. కాబట్టి నాది. కాబట్టి దానిని విడిచి పెట్టు" అన్నాడు సిద్ధార్థుడు. "ప్రాణంపోయే స్థితిలో నున్న ఈ హంసను బ్రతికించిన వాడిని నేను. కాబట్టి దానికి నేను స్వేచ్ఛను ప్రసాదిస్తాను తప్ప నీకు ఇవ్వలేను" అన్నాడు. ఇద్దరూ నాదంటే, నాదని వాదులాడుకున్నారు. చివరకు ఇరువురూ న్యాయస్థానానికి తీర్పుకోసం వెళ్ళారు. న్యాయాధికారి తీర్పుచెప్పలేక ఆ హంసను దూరంగా ఉంచి ఇరువురిని ఒకరి తరువాత ఒకరిని పిలవమని, అది ఎవరి వద్దకు వస్తే వారిదే అవుతుందని చెప్పారు. ఇద్దరూ దానికి అంగీకరించారు. హంసను దూరంగా ఉంచారు. దేవదత్తుడు హంసను పిలిచాడు. వెంటనే హంస ఎగురుకుంటూ అతని వద్దకు వచ్చి భుజంపై వాలింది. అందరూ కరతాళధ్వనులుగావించారు. సిద్ధార్థుడు ఆ హంసను స్వేచ్ఛగా సంచరించమని ఆకాశంలోకి విడిచిపెట్టాడు.

ఈ విధంగా సిద్ధార్థుడు చిన్ననాటి నుండి ప్రకృతిపైనా, జంతుజాలముపట్ల ఎంతో ప్రేమాభిమానాలు ప్రకటించేవాడు. అతనే పెద్దయ్యాక గౌతమబుద్ధునిగా ప్రసిద్ధికెక్కాడు.

## సూక్తి

**లోకంలో ప్రాణం కన్నా ప్రియమైనది ఏదీ లేదు. మనిషి తన ప్రాణాన్ని ఎంత ప్రేమగా చూసుకుంటాడో ఇతర ప్రాణుల పట్ల కూడా అంతే ప్రేమగా ఉండాలి.**

# అనుబంధం

1. శ్లోకాలు
2. పద్యాలు
3. పాటలు, గేయాలు
4. కథలు

# 1. శ్లోకాలు

1) అజ్ఞాన తిమిరాంధస్య – జ్ఞానాంజన శలాకయా ।
చక్షు రున్మీలితం యేన – తస్మై శ్రీ గురవేనమః ॥

**భావం :** మన చుట్టూ అజ్ఞానమను చీకటి వ్యాపించియున్నది. జ్ఞానం అను కాటుకను కనురెప్పలకు తాకించి, కనులను తెరిపించి, అజ్ఞానం అను చీకటిలో సైతం చూడగల దృష్టిని ప్రసాదించిన గురుదేవులకు నమస్కరించుచున్నాను.

2) అన్నదానం మహాదానం విద్యాదానం మహత్తరం ।
అన్నేన క్షణికాతృప్తిః యావజ్జీవంతు విద్యయా ॥

**భావం :** దానములలో కెల్ల అన్నదానం గొప్పనైనది. విద్యాదానము దానికంటె మహత్తరమైనది. ఎందుకంటే అన్నదానము వలన ఆపూటకు మాత్రమే కడుపు నిండి తృప్తి కలుగుతుంది. కాని విద్యాదానముచే జీవన పర్యంతము సుఖము కలుగుతుంది గదా!

3) కృషితో నాస్తి దుర్భిక్షం జపతో నాస్తి పాతకమ్ ।
మౌనేన కలహో నాస్తి నాస్తి జాగరతో భయమ్ ॥

**భావం :** వ్యవసాయం చేస్తుండటం వల్ల దారిద్ర్యం ఉండదు. జపం చేస్తుండడంవల్ల పాపము రాదు. మౌనంగా ఉండడంవల్ల కలహం రాదు. జాగరూకతతో (మెలకువ / అప్రమత్తత) ఉండడంవల్ల భయము ఉండదు.

# 2. పద్యాలు

1) నిలిచిన నీళ్ళు త్రాగ నీరు కాఱు బ్రతుకు
పరుగులెత్తవోయి పాలు త్రాగ
పరుగు నుండి పుట్టెనరుని నాగరికత
వాస్తవమ్ము నార్ల వారి మాట

**భావం :** నాగరిక ప్రపంచంలో నిదానంగా ఉంటే వెనుకబడిపోతావు. పరుగెత్తయినా పాలు త్రాగే కాలమిది. నేటి ఆధునికత వేగం నుండే పుట్టినది. ఇది నిజం.

2) కలిమిగల లోభికన్నను
విలసితముగ పేద మేలు వితరణియైనన్
చలిచెలమ మేలుకాదా
కులనిధి యంబోధి కన్న గువ్వల చెన్నా

**భావం :** ధనికుడైన పిసినారి కంటే దాన గుణమున్న పేదవాడే మేలు. అనంతజలరాశి గల సముద్రుడి కంటె మంచినీరున్న గొయ్యి మేలు కదా!

3) వినయంబు లేని విద్యయు
బెనుసైరణ లేని వృత్తి పేదల మీదన్
గనికరము లేని గుణమును
ననయము వదలయ్య నీకు, ననుఁగుఁకుమారా!

**భావం :** ఓ కుమారా! వినయములేని విద్యయు, ఓర్పులేని పనియు, పేదవారియందు దయలేని గుణము ఎప్పటికిని పనికిరాదు.

4) పెద్దలు విచ్చేసినచో
బద్ధకములైన దుష్టపద్ధతినైనన్
హద్దెరిగి లేవకున్నను
మొద్దువలెం జూతురతని ముద్దు కుమారా!

**భావం :** పెద్దలు వచ్చుట గమనించినంతనే గౌరవసూచకముగా లేచి నిలబడవలెను. బద్ధకముతోగాని, అహంకారముతోగాని హద్దు మరచి లేవకున్నచో... బుద్ధిలేని మొద్దువనిపించుకొందువు.

5) చిక్కియున్నవేళ సింహంబునైనను
ఒక్కకుక్క కరచి బాధవేయు
బలిమి లేనివేళ బంతంబు చెల్లదు
విశ్వదాభిరామ వినురవేమ!

**భావం :** సింహమునకు బలము లేనప్పుడు బలమైన కుక్క కూడా కరచి బాధపెట్టును. శక్తిలేనప్పుడు పంతములకు పోక తలదించుకుని తిరుగుట మంచిది.

6) ఫలము కోరకుండ పండ్ల నిచ్చును చెట్లు
పసులు గడ్డిమేసి పాలనిచ్చు
పరులకుపకరించు ప్రతిఫలంబున వీడి
భవ్య సుగుణశీల! భరతబాల!

7) కష్ట సుఖములందు కలసి మెలసి యుండి
చెడు తలంపు లెపుడు చేరనీక
మంచి పెంచువాడె మంచి స్నేహితుడౌను
భవ్య సుగుణశీల! భరతబాల.

8) మతములెన్ని యున్న మానవత్వమొకటె
భాషలెన్ని యున్న భావమొకటె
మానవత్వ మొకటె మనల కలిపియుంచు
భవ్య సుగుణశీల! భరతబాల!

9) పరగ రాతి గుండు పగులగొట్టను వచ్చు
కొండలన్ని పిండి గొట్టవచ్చు
కఠినచిత్తు మనసు కరిగింపగారాదు
విశ్వదాభిరామ వినురవేమ!

**భావం :** కొండను అయినా పగులకొట్టవచ్చు కాని కఠిన హృదయము కలవాని మనసు మాత్రము మార్చలేము.

10) గర్వపు పలుకులను కలలోన పలుకకు
పరుల పిలుపు చలువ పలుకుతోడ
నీవు చల్లగుండు నిత్యము ధరలోన
మన కబీరు మాట మణులమూట.

# 3. పాటలు / గేయాలు

## 1.పిల్లలారా పాపల్లారా

పిల్లల్లారా పాపల్లారా – రేపటి భారత వీరుల్లారా
పెద్దలకే ఒక దారిని చూపే పిల్లల్లారా – పిన్నల్లారా

1) మీ కన్నుల్లో పున్నమి జాబిలి ఉన్నాడు – ఉన్నాడు, పొంచున్నాడు
మీ మనసుల్లో దేవుడు కొలువై ఉన్నాడు – ఉన్నాడు, అతడున్నాడు
భారతమాతకు ముద్దుల పాపలు మీరేలే – మీరేలే
అమ్మకు మీపై అంతేలేని ప్రేమేలే – ప్రేమేలే ॥ పిల్లల్లారా ॥

2) భారతదేశం ఒకటే ఇల్లు
భారతమాతకు మీరే కళ్ళు – మీరే కళ్ళు, మీరే కళ్ళు
జాతి పతాకం పైకెగరేసి – జాతిగౌరవం కాపాడండి
బడిలో బయట అంతా కలిసి – భారతీయులై మెలగండి
కన్యాకుమారికి, కాశ్మీరానికి అన్యోన్యతను పెంచండి
వీడని బంధం వేయండీ ॥ పిల్లల్లారా ॥

## 2. ఆట కలిసి

ఆట కలిసి ఆడుదాం – పాట కలిసి పాడుదాం
ఆటపాట లాడుచునే – అడుగు ముందుకేయుదాం
ముందు ముందు కేగుదాం – ముందు ముందు కేగుదాం॥

1) అణువు చిన్నదే దానికి అమిత శక్తి ఉందిరా
విత్తు చిన్నదే దానికి సత్తువెంతో ఉందిరా
చేయి చేయి కలపరా ఐక్యతను చూపరా
ఐక్యతలో సంఘటనా శక్తి ఇమిడి ఉందిరా ॥ ఆట కలిసి ॥

2) చుక్క చుక్క నీటి బొట్టు ఒక్క నదిగ మారురా
పెక్కు నదులు ఒక్కటైతె పెద్ద సంద్రమగునురా
వ్యక్తి ఒక్కడే వ్యక్తుల శక్తి కూడ తక్కువే
వ్యక్తి వ్యక్తి కలియ మహా సంఘ శక్తి మగునురా ॥ ఆట కలిసి ॥

3) ప్రకృతి మాత ఒడిని రంగు రంగు పూవులన్నవీ
క్రమము తప్పి విచ్చలవిడి విడివడి పడియున్నవి.
ఏర్చి కూర్చుదాం కూర్చి మాలగాను మార్చుదాం
మార్చి భరతమాత పాద అర్చనమ్ము సేయుదాం ॥ ఆట కలిసి ॥

## 3. జయ జయ జన్మభూమి

జయ జయ జయ జన్మభూమి
జయ జయోస్తు మాతృభూమి

1) గంగా గౌతమి కృష్ణల కన్నతల్లి భారతి
కనక వర్ష మొలికించే స్వర్గసీమ భారతి
తల్లికి నీరాజనమిడ తరలి రండి రండి
రండీ రండీ రండీ రండీ ॥ జయ జయ ॥

2) అది ఋషుల జన్మభూమి ఇది పవిత్ర భూమి
ఈ పవిత్ర భూమిని రక్షించుట మన ధర్మం
ఇది భారత జనావళికి అసిధారా వ్రతము
ఇది భారత ప్రజావళికి పరీక్షా సమయము ॥ జయ జయ ॥

## 4. ఇదే ఇదే నాదేశం

ఇదే ఇదే నాదేశం భారతదేశం
ప్రాణమైన అర్పిద్దాం ఈదేశం కోసం

ఎందరో వీరులను కన్నతల్లి ఈదేశం
ఎన్నెన్నో కళలకు పుట్టినిల్లు నాదేశం ॥ ఎందరో ॥
ఈ భరత భూమిలో పుట్టడమే ఒక వరం
నా భరతమాతను తలచుటయే ఒక భాగ్యం ॥ ఇదే ॥

నింగిలోని వెలుగులతో ఎగురుతోంది మనజెండా
త్యాగధనుల త్యాగమె మన జెండా నిండా ॥ నింగి ॥
మన జెండా చిరకాలం స్వేచ్ఛగా ఎగరాలి
భరతజాతి కీర్తినే నలుదిశలా చాటాలి ॥ ఇదే ॥

వందేమాతరమంటూ మరణించెను అల్లూరి
జాతికే ధైర్యమిచ్చి పైకెగెరెను నేతాజీ ॥ వందే ॥
భావిశౌర్యానికి వారసులం అవుదాం
వందేమాతరమంటూ కలసి గీతి పాడుదాం ॥ ఇదే ॥
వందేమాతం! వందేమాతరం! వందేమాతరం!

## 5. జయము జయము

జయము జయము భరతమాత జయము నీకు జగన్మాత
ఈ జగాన సాటి ఎవ్వరే ఓయమ్మ నీకు!

1) గంగయమున గోదారి – సింధు కృష్ణ కావేరి
బ్రహ్మపుత్ర తుంగభద్ర – తపతీ నర్మద పెన్నా
పొంది పొరలె తరంగాలు – నీ మెడలో హారాలు
జీవనదులగన్నతల్లివే – ఓయమ్మ నీవు ॥ జయము ॥

2) హిమ వింధ్యా పర్వతాలు – దేవతలకు నిలయాలు
దట్టమైన అరణ్యాలు – మహామునుల స్థావరాలు
పసిడి పంట క్షేత్రాలు – పంచలోహ ఖనిజాలు
నిజముగ నీవు రత్నగర్భవే – ఓయమ్మ నీవు ॥ జయము ॥

3) లోకమంత చీకటిలో – తల్లడిల్లు తున్నప్పుడు
నాగరికత లేని నరులు – పామరులై ఉన్నప్పుడు
వేదాలను వెలికితెచ్చి – జ్ఞానభిక్ష పెట్టినావు
నిన్ను జగద్గురు వందురే – ఓయమ్మ నీవు ॥ జయము ॥

## 6. వందనం

వందనం వందనం వందనం
వందనం మా... మార్గదర్శులకు

మానవత్వపు మార్గమిచ్చి
మంచి మాటల వరాలిచ్చి
సమానత్వం – సామరస్యపు
వెలుగునిచ్చిన
మా... మార్గదర్శులకు ॥ వందనం ॥

మనుషులంత ఒక్కటేనని
మమతల కోవెళ్ళలో
దేశభక్తి భావనను
మానవాళికి పంచినట్టి
మా... మహనీయులకు ॥ వందనం ॥

సర్వజనుల సుఖముకోరి
మానవీయ పథమునిచ్చి
జాతి గౌరవము పెంచుకొరకు
జగతి నందు వెలుగు నింపిన
మా... త్యాగధనులకు

వందనం వందనం వందనం
వందనం మా... మహనీయులకు

## 7. బాలలం బాలలం

బాలలం బాలలం
భారతదేశ పౌరులం
వీరులం వీరులం
వీరమాట బిడ్డలం ॥ బాలలం ॥

దేశభక్తి కల్గి ఉండి
దేశసేవ చేసేదం
జన్మభూమికై మేము
ప్రాణమైన ఇచ్చెదం ॥ బాలలం ॥

మొక్కలనే నాటెదం
పచ్చదనం పెంచెదం
పరిసరాలనే మేము
పరిశుభ్రం చేసెదం ॥ బాలలం ॥

## 8. వైభవ భారతి పిల్లలము

వైభవ భారతి పిల్లలము
వంచన తెలియని మల్లెలము!! ॥ వైభవ ॥

హాయిగ ఆటలు ఆడెదము
తీయని పాటలు పాడెదము
నిత్యము శ్రద్ధగా చదివెదము
సత్యమునెప్పుడు నుడివెదము ॥ వైభవ ॥

పెద్దలను గౌరవించెదము
పిన్నలను ప్రేమించెదము
సమతనె మేము కోరెదము
మమతతో ముందు కేగెదము ॥ వైభవ ॥

జాతి రత్నముల దలచెదము
నీతి నియమముల వలచెదము
దేశమాతనే కొలిచెదము
త్యాగ నిరతితో నిలిచెదము ॥ వైభవ ॥

## 9. సువ్విలాలి

సువ్విసువ్వమ్మలాలి – సువ్విలాలి
దంచరమ్మ ఎఱ్ఱొడ్లు – తెల్లొడ్లను

ఏలొచ్చె ఎటులొచ్చె వరిగింజలు
ఎటకారమెందుకే వినుచెబుతాను ॥ సువ్వి ॥

దున్నిరమ్మ భూమినంతా దుమ్ము దుమ్ముగా
చల్లిరమ్మ చేలోనా వరిగింజలు ॥ సువ్వి ॥

గింజలన్ని మొక్కలుగా మొలకెత్తేను
నారంతా కోసిరమ్మ చేనులోన ॥ సువ్వి ॥

ఈ గింజలే... ఆ వరిగింజలు
ఆ గింజలే... ఈ వరిగింజలు ॥ సువ్వి ॥

## 10. బాలలం

బాలలం బాలలం భరతమాత బిడ్డలం
భావి భారత పౌరులం... మేం భావిభారత పౌరులం

కులం లేదు, మతం లేదు
స్వార్థమన్న మాట లేదు
కల్మషమే లేని మల్లెపువ్వులం
నవభారత నిర్మాణపు పునాదులం మేమే
కలిసి మెలిసి ప్రగతిని సాధించే ధీరులం ॥ బాలలం ॥

మనమంతా ఒకే జాతి
మానవజాతి అంటూ
మనం కలిసి పెంచాలి భారత ఖ్యాతి
ఎందరో మహనీయుల అడుగుజాడల నడచి
మన దేశపు ఖ్యాతిని చాటిచెప్పు వీరులం ॥ బాలలం ॥

# 4. కథలు

## 1. స్వస్థాన వేషాభిమానం

ఒక బాలుడు ఒక కొత్త భారతీయ విద్యాలయంలో ప్రవేశించాడు. అక్కడ ప్రధానాచార్యులు శ్రీ వేణుమాధవ దాన్ పంచె, లాల్చీ ధరించి సాధు వేషంలో ఉన్నారు. ఆయనను చూసి ఆ బాలుని మనసులో ఒక ప్రశ్న తలెత్తింది. విద్యాలయ ప్రధానాచార్యులే ఇలా పంచె – లాల్చీ ధరించి బడికి వస్తుంటే నేనెందుకు రాకూడదు? నేను కూడా ఈ బడిలో విద్యార్థినే కదా! అనుకున్నాడు బాలుడు ఇంటికొచ్చాడు. అక్కడ అతని దృష్టి స్వామి వివేకానంద చిత్రపటంపై పడింది. ఇట్టి దుస్తులు ధరించి వివేకానందుడు ప్రపంచమంతటిలోనూ ఖ్యాతికెక్కాడు. నాకు ఈ కోటు, ప్యాంటు ఎందుకు? బాలుని మనసులో భారతీయ వేషధారణ విషయంలో పట్టుదల ఏర్పడింది. మర్నాడే ఆ బాలుడు పంచె – లాల్చి ధరించాడు. అది చూసి అతని తండ్రి కోపగించాడు. కానీ ఆ బాలుడు దృఢంగానే చెప్పాడు. 'నాన్నగారూ! ఇది మన జాతీయ వేషం. ఇది నా ఒంటికి బావుండలేదా! మనం భారతీయులం. మనకు తగిన దుస్తులను మనం ధరించాలి తప్ప, ఆంగ్లేయుల కోటు, ప్యాంటు మనకెందుకు? అన్నాడు. ఆవిధంగా ఆ బాలునికి బాల్యంలోనే భారతీయ వేషభాషలపై అభిమానం ఏర్పడింది. అతడే సుభాష్ చంద్రబోస్

## 2. తప్పుకు శిక్ష కోరిన విద్యార్థి

ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలో విద్యార్థులందరికీ గణితంలో కొన్ని ప్రశ్నలు ఇచ్చి ఇంటిపనిగా చేసుకురమ్మన్నారు. ఒక విద్యార్థి అన్నింటినీ సమర్థవంతంగా పూర్తి చేశాడు. ఒక లెక్క సరిగా చెయ్యలేక తన అన్న ద్వారా తెలుసుకొని పూర్తి చేశాడు. మర్నాడు తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందరి విద్యార్థుల ఇంటి పనిని చూశాడు. కానీ అందరిలో ఆ బాలుడొక్కడే అన్ని ప్రశ్నలు పూర్తి చేశాడు. అందుకు అతనిని అభినందించి ఒక కలాన్ని ఆ బాలుడికి బహుమతిగా ఇవ్వబోయారు. కానీ ఆ బాలుడు వెక్కి వెక్కి ఏడుస్తూ. "మాష్టరుగారూ! నేను అన్ని లెక్కలు నా స్వతహాగా చెయ్యలేదు. ఒక లెక్క మా అన్న ద్వారా తెల్సుకొని చేశాను. అన్నీ నేనే చేశానని అబద్ధం చెప్పాను. నాకు బహుమతి కాదు శిక్ష వెయ్యండి" అంటూ ప్రార్థించసాగాడు. ఆ బాలుని సత్యసంధతకు మెచ్చుకొని ఉపాధ్యాయుడు "ఈ బహుమతి ఇప్పుడు నీ సత్యసంధతను మెచ్చుకొని ఇస్తున్నాను తీసుకో!" అని ఇచ్చాడు. ఆ బాలుడే మహాత్మాగాంధీ గారి రాజకీయగురువైన గోపాలకృష్ణ గోఖలే.

## 3. డబ్బు సంచి

అక్బర్ పరిపాలిస్తున్న రోజులలో ఆగ్రాలో ఒక కటికవాడు నివసిస్తుండేవాడు. అతడు మంచివాడు. నిజాయితీపరుడు. ప్రజలకు మంచి మాంసాన్ని సరసమైన ధరకు అమ్ముతుండేవాడు. అందువల్ల అతని దుకాణం ఎప్పుడూ కిక్కిరిసి ఉండేది.

ఒకరోజు ఉదయం చాలా మంది కొనుగోలుదారులతో అతని దుకాణం నిండి ఉంది. ఆ కటికవాడు వారికి మాంసం నరికి ఇస్తూ డబ్బు తీసుకుంటున్నాడు. అందుకు వీలుగా తన డబ్బు సంచిని బల్లపై తన ప్రక్కనే పెట్టుకున్నాడు. దుకాణానికి వచ్చిన ఒక ధాన్యం వర్తకుడు ఒక కిలో మాంసం ఇమ్మన్నాడు. కటికవాడు మాంసం నరకడానికి అటు తిరగగానే ఆ వర్తకుడు బల్ల మీద ఉన్న కటికవాని డబ్బు సంచిని తస్కరించాడు. పైగా అది తన సొంత సంచీలాగా పట్టుకొని అందులో నుంచి కొన్న మాంసానికి డబ్బు తీసి ఇవ్వబోయాడు.

అది చూసిన కటికవాడు “అది నా సంచీ. నువ్వు దొంగిలించావు” అన్నాడు.

“ఇది నీదా? ఏం కాదు. నా డబ్బు సంచి ఇది” అన్నాడు ధాన్యం వర్తకుడు. ఇద్దరి మధ్యా వాదన పెరిగింది. జనం గుమికూడారు. కొందరు కటికవాడిని, మరికొందరు ధాన్యం వర్తకుణ్ణి సమర్థించసాగారు. ఎంతకీ పరిష్కారం దొరకలేదు. ఇక లాభం లేదని, ఈ గొడవకు సరైన పరిష్కారం బీర్బల్ ఒక్కడే చెప్పగలడని భావించిన ప్రజలు కటికవాణ్ణి, ధాన్యం వర్తకుణ్ణి బీర్బల్ దగ్గరకు తీసుకు వెళ్ళారు. వారిద్దరికీ వచ్చిన గొడవ గురించి బీర్బల్‌కు వివరించారు.

బీర్బల్ ఆ డబ్బు సంచిని నిశితంగా పరిశీలించాడు. దానిపై అక్కడక్కడా రక్తపు మరకలు ఉన్నాయి. దాంతో ఆ సంచి కటికవాడిదేనని బీర్బల్ నిర్ధారణకు వచ్చాడు. మాంసం అమ్మేటప్పుడు రద్దీ కారణంగా కటికవాడు మాంసం నరికిన చేతితోనే డబ్బు తీసుకోవడం, ఇవ్వడం చేయడంవల్ల నాణేలపై రక్తపు మరకలు పడ్డాయి. బీర్బల్ ఆ డబ్బు సంచీని కటికవాడికి ఇచ్చి “దొంగతనం చేయడమే కాక పైగా అబద్ధం ఆడావు. ఇది మహా నేరం” అని చెప్పి ధాన్యం వర్తకుడికి శిక్ష విధించాడు.

కటికవాడు బీర్బల్‌కు కృతజ్ఞతలు తెలిపి, తన డబ్బు సంచి దక్కినందుకు సంతోషపడ్డాడు.

## 4. బక్క గొర్రె

ఒకసారి అక్బర్, బీర్బల్ పచ్చిక బయలులో నడుస్తున్నారు. అక్కడ ఒక గొర్రెల కాపరి గొర్రెలను మేపుతూ కన్పించాడు. వాటిని చూస్తూ "తినడానికి బాగా మేత దొరికినా ఆ గొర్రెలు ఎందుకు అంత బక్కగా ఉన్నాయి? అని ప్రశ్నించాడు అక్బర్.

"ఒక్కోసారి మనుషులు కూడా రెండింతలు తిన్నా లావు అవ్వరు మహారాజా! జంతువులు కూడా అంతే" బదులిచ్చాడు బీర్బల్.

"నువ్వెప్పుడూ నా మాటలు కాదంటావు. నువ్వు ఒక గొర్రెను తీసుకొని దానికి రోజూ రెండింతలు మేత వెయ్యి. అది ఎలా పెరుగుతుందో చూద్దాం" అని బీర్బల్‌ను ఆదేశించాడు అక్బర్.

చక్రవర్తి ఆజ్ఞ ప్రకారం బక్కపలుచని గొర్రె నొకదానిని బీర్బల్ ఒక ఇంట్లో పెంచసాగాడు. దానికి రోజూ రెండు సార్లు కావలసినంత మేత వేస్తున్నాడు. రాత్రుళ్ళు దానికి కాపలాగా ఒక కసాయివాణ్ణి నియమించాడు. కసాయివాణ్ణి చూసి భయపడిన గొర్రె ఎంత తిన్నా బరువు పెరగలేదు.

ఒక నెల గడిచింది. అక్బర్ గొర్రెను చూపించమన్నాడు. బీర్బల్ చూపించాడు. ఆరోజు పచ్చిక బయలులో చూసినప్పుడు ఎలా ఉందో అలాగే బక్కగా ఉంది. అక్బర్ అనుమానంగా "నువ్వు దానికి సరిగా తిండి పెట్టావా?" అని అడిగాడు.

"పెట్టాను మహారాజా! అయితే మనుషులకు మానసిక ఆందోళన ఉంటే ఎలా బరువు పెరగలేరో జంతువులు కూడా ఆందోళన చెందితే బరువు పెరగలేవని అర్థమైంది. మహారాజా!" అంటూ తాను కసాయివాణ్ణి గొర్రెకు కాపలాగా పెట్టిన విషయాన్ని వివరించాడు బీర్బల్.

విషయం నిరూపణకోసం బీర్బల్ అనుసరించిన పద్ధతికి అక్బర్ ముగ్ధుడయ్యాడు. బీర్బల్‌ను ప్రశంసించి అనేక కానుకలు సమర్పించాడు.

## 5. కృష్ణుడు - సుధాముడు

కృష్ణుడు, సుధాముడు (కుచేలుడు) బాల్య స్నేహితులు. సాందీపమహర్షి వద్ద విద్యాభ్యాసం చేశారు. ఆరోజుల్లో వారి స్నేహం అందర్నీ ఎంతగానో అలరించేది. కుచేలుడు కటిక బీదవాడు పైగా, అధిక సంతానవంతుడు. అందుచేత అతను దారిద్ర్య బాధను అనుభవించసాగాడు. కృష్ణుడు ద్వారకలో రాజభోగాలు అనుభవిస్తున్నాడు. కుచేలుని భార్య భర్తను చేరి "ఆర్యా! మీ స్నేహితుడు కృష్ణుడు ద్వారాకాధిపతిగా ఉన్నారు కదా! అతని వద్దకు పోయి ఏదైనా సహాయం అడగండి. మన కష్టాలు గట్టెక్కుతాయి" అని చెప్పింది.

దానికి కుచేలుడు "ఎప్పుడో బాల్యమందున్న స్నేహాన్ని కృష్ణుడు ఇప్పుడు గుర్తిస్తాడా! ఐనా, నీ మాట కాదనటమెందుకు? స్నేహితుని దర్శనభాగ్యమైనా దక్కుతుంది కదా! వెళ్ళివస్తాను. నా స్నేహితుని కొరకు ఏదైనా సమకూర్చిపెట్టు" అని భార్యతో చెప్పాడు. "ఏమి సమకూర్చగలదు ఆమె. ఆలోచించి కొన్ని అటుకులు మూటకట్టి ఇచ్చింది. వాటినే పట్టుకొని బయలుదేరాడు కుచేలుడు.

ద్వారకలో ద్వారపాలకులు కుచేలుని వేషమును చూసి నవ్వుకోసాగారు. ఇలాంటి కటిక బీదబాపడు కృష్ణయ్యకు స్నేహితుడా! సరి సరి... వినడానికే సిగ్గుగా ఉందే! అంటూ హేళనచెయ్యసాగారు. కుచేలుని రాకకు సంబంధించిన వార్త కృష్ణునికి తెలిసింది. "ఆహా! నా బాల్య స్నేహితులు సుధాముడు వచ్చాడా?" అంటూ వడివడిగా వచ్చి సుధాముని ఆలింగనం చేసుకొని లోనికి తీసుకుపోయి ఉచితాసనంపై కూర్చుండబెట్టాడు. బాల్యచేష్టలను గుర్తుచేస్తూ స్నేహమాధుర్యాన్ని ఆస్వాదించాడు కృష్ణుడు.

కృష్ణుని స్నేహధర్మానికి, ప్రేమకు, సహృదయతకు, కుచేలుడు ఆనందంతో పరవశించిపోయాడు. క్షేమ సమాచారములన్నీ పూర్తయ్యాక "మిత్రమా! నాకొరకు ఏదో కానుక తెచ్చి దాస్తావెందుకు? ఇలాతే" అంటూ చినిగిన వస్త్రంలోనున్న అటుకులమూటను అందుకున్నాడు కృష్ణుడు. వాటినే అమితమైన ప్రేమతో ఆరగించాడు కృష్ణుడు. అంతటి ప్రేమను, స్నేహాన్ని ప్రకటించిన కృష్ణునికి తన కష్టాలు చెప్పలేకపోయాడు కుచేలుడు ఐనా, కృష్ణుడు అతని అవస్థను గ్రహించి, అడగకుండానే సమస్త సిరిసంపదలు సమకూర్చిపెట్టాడు. స్నేహానికి చక్కని ఉదాహరణ కృష్ణసుధాముల ఉదంతం.

## 6. అంతా మన మంచికే

ఒక రాజు దగ్గర ఒక మంత్రి ఉండేవాడు. ఏ సంఘటన జరిగినా ఆయన "అంతా మన మంచికే" అనేవాడు. ఒకసారి రాజుగారు చాకుతో మామిడి పండు కోస్తుండగా ఎడమచేతి బొటన వేలికి గాయమైంది. ఈ విషయం విన్న మంత్రి ఎప్పటిలాగే "అంతా మన మంచికే మహారాజా!" అన్నాడు. ఇంకేముంది రాజుగారి కోపానికి హద్దేలేదు. "నా వేలు తెగితే మంచిదేనంటావా?" అని మంత్రిని బంధించి కారాగారానికి పంపాడు. అప్పుడు కూడా మంత్రి "అంతా మన మంచికే" అన్నాడు.

ఆ మరునాడు రాజుగారికి వేటకు వెళ్ళాలనిపించింది. సామాన్యంగా మంత్రితో కలిసి వెళ్ళేవాడు. మంత్రి చెరసాలలో ఉన్నాడు కదా! తాను ఒంటరిగానే వేటకు బయలుదేరాడు. వేటాడి, వేటాడి అలసటతో ఒక చెట్టు కింద నిద్రపోయాడు.

కొందరు ఆటవికులు వారి ఇలువేలుపునకు బలి ఇవ్వటానికి తగిన వాడి కోసం వెదుకుతూ, నిద్రిస్తున్న రాజును చూసి చాలా ఆనందపడ్డారు. ఆయనను బంధించి తీసుకుపోయారు.

బలి ఇవ్వబోయే చివరి క్షణంలో "బలి పశువుకు అవయవ లోపం ఉండకూడదు, అమ్మ ఆగ్రహిస్తుంది. జాగ్రత్తగా చూడండి" అన్నాడు నాయకుడు. చూస్తే రాజు గారి ఎడమ చేతి బొటన వేలికి గాయం కనిపించింది. బలికి పనికిరాడని వదిలేశారు. బ్రతుకుజీవుడా అని రాజు రాజధానికి తిరిగి వచ్చాడు. మంత్రి అన్నట్లు వేలు తెగి గాయం కావటం నా మంచికే అయింది. లేకపోతే ప్రాణమే పోయి ఉండేది అనుకొన్నాడు. కాని చెరసాల జీవితం మంత్రికి ఎలా మంచిదయింది? అనుకొన్నాడు. మంత్రిని పిలిపించి అడిగాడు.

మంత్రి "మహారాజా! చెరసాలలో లేకపోతే నేను కూడా మీతో వేటకు వచ్చేవాణ్ణి కదా! మీ బదులు నేను బలి ఇవ్వబడేవాడిని. అందుకే అంతా మన మంచికే అన్నాను" అన్నాడు.

రాజు సంతోషించి మంత్రిని విడిపించి, ఎన్నో విధాల సన్మానించాడు. కష్టాలు వచ్చాయని క్రుంగిపోకూడదు. అదీ మన మంచికే అనుకొని ముందడుగు వేయాలి.

## 7. గోవులు - శ్రీకృష్ణుడు

శ్రీకృష్ణ, బలరాములు నివసించే గోకులానికి దగ్గరలో బృందావనం ఉన్నది. బృందావనంలో ప్రకృతి రమణీయమైన ఎన్నో చూడముచ్చటైన వనాలు ఉన్నాయి. ఆ వనాలలో ఎన్నో వింతలు, అందమైన పూలతోటలు ఉన్నాయి. బృందావనానికి దగ్గరలోనే యమునానది ఉన్నది. బృందావనంలోని పచ్చిక మైదానాలలో గోపాలకులు ఆలమందలను మేపుతూ ఉండేవారు. శ్రీకృష్ణుని బాల్య జీవితమంతా గోకులం, బృందావనంలో గడిచింది. కృష్ణుడు గోపాలకులతో కలిసి ఆవుల మందలను తోలుకొని వెళ్ళి గోపాలకులతో ఆడుతూ పాడుతూ మురళి వాయిస్తూ బృందావనంలో విహరించేవాడు.

ఒకనాడు ఆలమందలను పచ్చిక బయళ్ళలో మేపి గోపబాలురు కృష్ణుడు అందరూ కలిసి చద్ది అన్నాలు ఆరగించారు. బ్రహ్మదేవుడు ఆలమందలను, గోపబాలకులను మాయం చేసాడు. కృష్ణుడు

సంగతి గ్రహించి వెంటనే తన మాయతో గోపబాలకులను, ఆలమందలను సృష్టించాడు. కొంతకాలం గడిచింది. బ్రహ్మదేవుడు బృందావనం వచ్చి చూసాడు. నిజమైన ఆలమందలను, గోపబాలురను తాను మాయచేసి దాచినప్పటికీ శ్రీకృష్ణుడు తన మాయతో వాటిని తిరిగి సృష్టించడం చూసి తన అజ్ఞానానికి సిగ్గుపడ్డాడు. శ్రీకృష్ణుని అనుగ్రహించమని ప్రార్థించాడు. ఈ విధంగా బృందావనంలో శ్రీకృష్ణుడు గోవులను రక్షించి ప్రకృతిని ప్రేమించాడని చెప్పవచ్చును.

## 8. మంచిపని

రాము, సోము రాఘవయ్య గారి మనుమలు. వీరిద్దరు కవలలు కావడం వలన అల్లారుముద్దుగా పెరిగారు. వారి పుట్టిన రోజునాడు ఇంట్లో పెద్ద వేడుక జరిపారు. రాఘవయ్య ఒక పుట్టినరోజునాడు వారిద్దరినీ పిలిచి "ఈసారి మీ పుట్టినరోజుకి చెరొక పదిరూపాయలు ఇస్తున్నా. దాన్ని మీరు ఎలా ఖర్చుపెట్టారో నాకు చెప్పాలి" అంటూ చెప్పాడు. వారిద్దరూ తాతయ్యకు ధన్యవాదాలు తెలిపారు. రాము తాతయ్య ఇచ్చిన పదిరూపాయలతో రెండు చాక్లెట్లు కొనుక్కొని తిన్నాడు. సోము తాతయ్య ఇచ్చిన పదిరూపాయలతో రెండు పెన్నులు కొని ఒకటి తను ఉంచుకొని, మరొకటి వారింట్లో పనిమనిషి రంగమ్మ కొడుక్కి నారాయణకు ఇచ్చాడు. సాయంత్రం ఇద్దర్నీ పిలిచి తాతయ్య, రాఘవయ్య అడిగాడు. రాము, సోము వాళ్ళు ఏవిధంగా ఖర్చుపెట్టిందీ చెప్పారు. రాఘవయ్య అర్థం చేసుకొని మౌనంగా ఉండిపోయాడు. అప్పుడు సోము "ఏం తాతయ్యా! నేను చేసిన పని మంచిది కాదా! రంగమ్మ కొడుకు నారాయణ చాలా మంచివాడు! పైగా బాగా చదువుతాడు. మేమిద్దరం స్నేహితులం. వాడు పేదవాడు కావడం వలన పుస్తకాలకు పెన్నులకు ఇబ్బంది పడుతుంటాడు. వాడికి నా పుట్టినరోజు సందర్భంగా పెన్ను ఇవ్వడం వలన వాడు ఎంత ఆనందించాడో తెల్సా!" అంటూ చెప్పాడు. రాఘవయ్య కళ్ళనుండి ఆనందభాష్పాలు రాలాయి. "సోమూ! నువ్వు చాలా మంచిపని చేశావు. ఇంత చిన్న వయసులోనే తోటివారిపై ప్రేమ, సహృదయత గుణాలు అలవడడం చాలా గొప్ప విషయం. నువ్వు చేసిన పని నాకు కూడా ప్రేరణ ఇచ్చింది. నీతోపాటుగా నీ స్నేహితుడు నారాయణకు కూడా నేను పుస్తకాలు కొనిపెడతా" అంటూ అభినందించాడు. సమాజంలో మనతో పాటు ఉన్నవారికి కూడా మనం సహాయపడగలగాలి. వారిపై ప్రేమను ప్రకటించగలగాలి.

## 9. ధ్రువుడు

పూర్వం ఉత్తానపాదుడు అనే రాజు ఉండేవాడు. ఆయనకు సునీతి, సురుచి అని ఇద్దరు భార్యలు. సునీతి కుమారుడు ధ్రువుడు. సురుచి కుమారుడు ఉత్తముడు. రాజుకు సురుచి అంటే ప్రేమ ఎక్కువ. ఒకనాడు సురుచి కుమారుడు రాజు తొడపై కూర్చున్నాడు. అది చూచి ధ్రువుడు కూడా తండ్రి తొడపై కూర్చున్నాడు. సురుచి కోపంతో ధ్రువుని చెయ్యి పట్టి కిందికి తోసి ఇట్లా అంది "నా కడుపున పుట్టిన వారికి ఆ అదృష్టం ఉంది" అని. ధ్రువుడు దుఃఖిస్తూ తల్లికి ఈ విషయం చెప్పాడు. తల్లి దుఃఖించింది కాని బదులు చెప్పలేకపోయింది.

ధ్రువుడు తల్లి అనుమతితో అందరికంటే అధికుడైన విష్ణువును గురించి తపస్సు చేయటానికి బయలుదేరాడు. అడవి మార్గం గుండా పోతున్నాడు. దారిలో నారదుడు కనిపించాడు. బాలుని పట్టుదలకు మెచ్చి అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశించినాడు. "ఓం నమో నారాయణాయ" అనే ఆ దివ్య మంత్రాన్ని జపిస్తూ ఘోర తపస్సు చేశాడు ధ్రువుడు. విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. నీకేం వరం కావాలో కోరుకోమన్నాడు. భక్తితో ధ్రువుడు విష్ణువును స్తుతించాడు. "ఓ తాపస మందారా! నీ పాదకమల సేవ, నీ పాదార్చకుల తోడి స్నేహం, అపార భూతదయ నాకు కలుగేయు"మని ప్రార్థించాడు. విష్ణువు ధ్రువుని భక్తికి మెచ్చి అనేక వేల సంవత్సరాలు రాజ్యం ఏలిన తరువాత నక్షత్ర స్థానం పొందేటట్లు వరం ఇచ్చాడు.

తపస్సు నుండి తిరిగి వచ్చిన ధ్రువుని చూచి తండ్రి సంతోషించాడు. ధ్రువుని రాజుగా చేసి తాను యోగ మార్గాన స్వర్గానికి వెళ్ళిపోయాడు.

## 10. చెంబెడు పాలు

ఒకసారి అక్బర్, బీర్బల్‌ను "మన దేశంలో ఉన్న మోసాగాళ్ళెవరో చూడాలని ఉంది. గతంలో దర్జీలు చేసే మోసాన్ని నాకు చూపించావు. ఇంకెవరయినా అలాంటి వాళ్ళు ఉన్నారా?" అని ప్రశ్నించాడు.

"హుజూర్! మన దేశంలో ఉన్న చిల్లర వర్తకులు పెద్ద మోసగాళ్ళు. వారు బియ్యంలో – రాళ్ళు, నీళ్ళలో – పాలు, వెన్నలో – పిండి కలుపుతున్నారు. వాటిని ప్రజలకు అమ్మి డబ్బు గుంజుతున్నారు" అని బీర్బల్ చెప్పాడు. "అలా ఎలా జరుగుతోంది? వారినెవరూ తనిఖీ చేయడం లేదా?" అని ప్రశ్నించాడు చక్రవర్తి.

మహారాజా! చిల్లర వర్తకులు ఈ పనిని చాలా తెలివిగా, ఎవరికీ దొరకకుండా చేస్తున్నారు. అలాంటి వాళ్ళ జాబితా నొకటి తయారు చేశాను" అంటూ ఆ జాబితాను చక్రవర్తికి అందించాడు బీర్బల్.

బీర్బల్ నిజం చెబుతున్నాడో లేదో పరిశీలించదలచాడు అక్బర్. సహజంగా వర్తకులు రాజు విషయంలోను, మతం విషయంలోను మోసానికి పాల్పడరు. కాబట్టి ఆ జాబితాలో ఉన్నవారందరినీ దర్బారుకు రమ్మని కబురు పెట్టించాడు.

వర్తకులంతా భయం భయంగా వచ్చారు. వారిని ఆహ్వానించిన చక్రవర్తి "మిత్రులారా! మిమ్మల్నందరినీ ఒక మంచి కార్యక్రమానికి సహకరించమని పిలిపించాను. రాజప్రసాదంలో ఒక మతపరమైన ఉత్సవం ఉంది. దానికి పాలు కావాలి. మీరంతా తలా ఒక చెంబెడు పాలు తెచ్చివ్వాలి" అని అభ్యర్థించాడు. వర్తకులంతా ఆనందంగా అంగీకరించారు మంచి పనికి చెంబెడేం ఖర్మ బిందెడు పాలు అయినా తెస్తామన్నారు.

అక్కడే ఉన్న బీర్బల్ "ఎక్కువ అవసరంలేదు. తలా ఒక చెంబెడు తెస్తే చాలు. రాజప్రసాదపు ద్వారంవద్ద పెద్దకుండను పెడతాం. మీరు తెచ్చిన పాలను అందులోపోసి వెళ్తే చాలు" అని చెప్పాడు. వర్తకులంతా వెళ్ళిపోయారు. అందరూ పాలుపోస్తారు కదా! మనం ఒక్కరం నీళ్ళు పోస్తే ఏమౌతుంది? అని ఎవరికి వారు ఆలోచించారు. అందరూ ఒకరికి తెలియకుండా మరొకరు పాలకు బదులు నీళ్ళు తెచ్చి ఎవరూ చూడకుండా ఆ కుండలో పోసి వెళ్ళారు.

తర్వాత అక్బర్, బీర్బల్ కుండలోని పాలను చూడడానికి వెళ్ళారు. అందులో పాలకు బదులు నీళ్ళు ఉన్నాయి. చక్రవర్తికి బాగా కోపం వచ్చింది. "వీళ్ళకు రాజన్నా, దేవుడన్నా భయం లేదు. దేవుడి పేరు చెప్పినా నీళ్ళు పోశారు. వీళ్ళు ప్రజలను ఇంకెంత మోసం చేస్తున్నారో?" అని వాళ్ళ ఆస్తులన్నీ జప్తుచేసి బీద ప్రజలకు పంచమని ఆజ్ఞాపించాడు.

తర్వాత "బీర్బల్ ! నాకళ్ళు తెరిపించావు. నారాజ్యంలో ఎంత అవినీతి ఉందో చూపించావు అంటూ బీర్బల్‌ను ఘనంగా సత్కరించాడు అక్బర్.